http://www.agnidharanews.com

# అగ్నిధార

శుక్రవారం 30 మే 2025

నిజాల నిప్పు కణిక

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad


## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

# కాలం చెల్లిన రూపాయి మోదీ





- భారతీయుల ఆత్మగౌరవాన్ని ట్రంప్ దగ్గర తాకట్టు పెడతారా..
- ప్రధాని మోదీపై సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్
- దేశ భద్రత విషయంలో రాజకీయాలకు తావులేదు: రేవంత్
- "ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా నెక్లెస్ రోడ్డులో ర్యాలీ చేశాం
- పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పాలని మోదీకి మద్దతు తెలిపాం
- 4 రోజుల యుద్ధం తర్వాత ఏం జరిగిందో తెలియదు.
- గుండెల్లో ధైర్యం ఉన్న నాయకుడే యుద్ధాన్ని గెలిపిస్తాడు
- గతంలో ఇందిరాగాంధీ చైనాను మోకాళ్లపై కూర్చోబెట్టారు
- గల్వాన్ ఘటనలో మన కర్నల్ సంతోష్‌ను పొట్టన పెట్టుకుంటే ఏమీ చేయలేకపోయాం
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

దేశ భద్రత విషయంలో రాజకీయాలకు తావులేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భారత్ సైన్యం విజయవంతంగా ఆపరేషన్ సిందూర్ నిర్వహించిందన్నారు. రాజకీయాలకు అతీతంగా ఆపరేషన్ సిందూర్‌కు మద్దతిచ్చినట్లు తెలిపారు. ఏఐసీసీ ఆదేశం మేరకు మేడ్చల్‌లోని బాచుపల్లిలో కాంగ్రెస్ 'జైహింద్ ర్యాలీ' నిర్వహించింది. వీఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి కేజీఆర్ కన్వెన్షన్ వరకు సాగిన ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రేవంత్ మాట్లాడారు.

3






## బంగ్లాదేశ్‌లో ఎన్నికలు?

- డిసెంబర్ కల్లా దేశంలో ఎన్నికలు నిర్వహించాలని పలు పార్టీలు డిమాండ్
- ముహమ్మద్ యూనస్ సారథ్యంలోని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వంపై స్థానికంగా ఒత్తిడి



## మోదీ జీ.. ఎవరి సత్తా ఏంటో ఎన్నికల్లో చూస్కుందాం

- రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఎవరి పక్షాన ఉన్నారో అనేది తేలుతుందని మోదీకి సవాల్
- పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ



## బెంగాల్‌లో నిర్మమత సర్కార్

- మోదీ మండిపాటు
- ప్రస్తుతం రాష్ట్రం వరుస సంక్షోభాలతో సతమతమవుతోంది
- ముర్షిదాబాద్, మాల్దాలో చోటుచేసుకున్న ఘర్షణలు ఆమె ప్రభుత్వ క్రూరత్వం, ఉదాసీనతకు నిదర్శనం

# రైతాంగానికి ప్రభుత్వం అండ

- 65 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతాంగం పండించారు
- రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతోంది
- అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు..
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ఖమ్మం

చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఈ ఏడాది ధాన్యం పండించారని, 65 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతాంగం పండించారని, రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేయడం - మిగతా3లో

# మాకూ కేబినెట్‌లో చోటివ్వండి!



- 'మంత్రివర్గంలో మాదిగ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం గురించి సీఎం, పీసీపీ, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ కి తెలిపే ఢిల్లీ వచ్చాం
- మాది న్యాయమైన డిమాండ్. మాదిగ కులస్తునికి ఖచ్చితంగా కేబినెట్‌లో స్థానం కల్పించాలి
- తెలంగాణలో మాదిగ సామాజికవర్గం పెద్ద సామాజిక వర్గం.
- మాదిగ కులానికి చెందిన తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

పాస్ పోర్ట్ వచ్చిన మూడు రోజుల్లో

# ఇండియాకు రావాలి



విచారణకు పూర్తిగా సహకరించాలని ప్రభాకర్ రావును ఆదేశించిన ధర్మాసనం

## చిరునామా కనుగొనడంలో ఇబ్బందులకు ఇక చెక్!



ఆధార్ తరహాలో యూనిక్ నంబర్ కేటాయింపు

'డిజిటల్ అడ్రస్ సిస్టమ్' తేనున్న కేంద్ర ప్రభుత్వం

# సొంత పార్టీ వాళ్లే ఓడించారు

- భారాస ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు
- భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు తాను అంతర్గతంగా ఇచ్చిన ఫీడ్‌బ్యాక్ ఎలా లీక్ అయింది
- లీకు వీరులను ఎండగట్టమంటే నాపై ప్రతాపమా?
- "కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే నేతలెవరూ స్పందించకపోతే ఎలా?
- ఇంటి ఆడబిడ్డ గురించి ఎలా పడితే అలా మాట్లాడిస్తే అది మర్యాదేనా?
- కడుపులో బిడ్డను పెట్టుకుని ఉద్యమంలో పనిచేశా



హైదరాబాద్

భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు తాను అంతర్గతంగా ఇచ్చిన ఫీడ్‌బ్యాక్ ఎలా లీక్ అయిందని ఆయన కుమార్తె, ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. కట్టడి చేయమంటే పెయిడ్ సోషల్ మీడియాలో విమర్శిస్తున్నారని ఆరోపించారు. మీడియాతో చిట్‌చాట్‌లో ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. "కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే నేతలెవరూ స్పందించకపోతే ఎలా? నాకు నీతులు చెబుతూ కోవర్టులు ఉన్నారంటున్నారు. నా మీద పడి ఏడిస్తే ఎలా ఇంటి ఆడబిడ్డ గురించి ఎలా పడితే అలా మాట్లాడిస్తే అది మర్యాదేనా? లిక్కర్ కేసు సమయంలో రాజీనామా చేస్తానంటే కేసీఆర్ వద్దని వారించారు. ఎంపీగా పోటీ చేస్తే సొంత పార్టీ వాళ్లే కుట్రపూరితంగా ఓడించారు. అదే జిల్లాలో ప్రొటోకాల్ ఉండాలని కేసీఆర్ ఎమ్మెల్సీ ఇచ్చారు. లీకు వీరులను ఎండగట్టమంటే నాపై ప్రతాపం చూపుతున్నారు. కాంగ్రెస్, భాజపాపై మాట్లాడాలి కానీ.. నాపై దాడి చేస్తే ఎలా? జైలులో ఉన్నప్పుడే ఆ - మిగతా3లో

కాంట్రాక్టులపై సంతకాలు చేస్తారు..

## డెలివరీలు జరగవు





- మన దళాలు.. పరిశ్రమ మధ్య విశ్వాసం పెరగాల్సిన అవసరం ఉంది.
- వాయుసేన చీఫ్ అసంతృప్తి

# బంగ్లాదేశ్‌లో ఎన్నికలు?



**న్యూ ఢిల్లీ :** పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో నిరసనలు కొనసాగుతున్నాయి. ముహమ్మద్ యూనస్ సారథ్యంలోని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వంపై స్థానికంగా ఒత్తిడి పెంచింది. డిసెంబర్ కల్లా దేశంలో ఎన్నికలు నిర్వహించాలని పలు పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వేలాది మంది యువజనులు, బీఎన్‌పీ కార్యకర్తలు దేశ వ్యాప్తంగా నిరసన చేపడుతున్నారు. ఈ క్రమంలో బంగ్లాదేశ్ ఎన్నికలపై ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ స్పందించారు. ఈ ఏడాది డిసెంబర్ నుంచి వచ్చే ఏడాది (2026) జూన్ మధ్య ఎప్పుడైనా ఎన్నికలు జరగొచ్చని చెప్పారు. ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్న యూనస్.. టోక్యోలో నిర్వహించిన ఓ పబ్లిక్ ర్యాలీలో ఈ మేరకు ప్రకటన చేశారు. కొన్ని సంస్కరణలు చేపడుతున్నట్లు చెప్పారు. సంస్కరణల అమలు తీరును బట్టి ఈ ఏడాది డిసెంబర్ నుంచి వచ్చే ఏడాది జూన్ మధ్యలో ఎన్నికలను నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. గతేడాది బంగ్లాలో రాజకీయ అస్థిరత నెలకొన్న విషయం తెలిసిందే. ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మొదలైన విద్యార్థుల ఉద్యమం హింసాత్మకంగా మారింది. వేలాది మంది నిరసనకారులు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ప్రజా ఉద్యమానికి జడసి ప్రధాని షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేసి దేశం వీడారు. దీంతో రంగంలోకి దిగిన ఆర్మీ దేశాన్ని తమ చేతుల్లోకి తీసుకుంది. ఆ తర్వాత బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ చీఫ్ అడ్వయిజర్‌గా నోబెల్ బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ బాధ్యతలు చేపట్టారు. గతేడాది ఆగస్టు 8న ఆయన తాత్కాలిక ప్రభుత్వాధినేతగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ దేశంలో మళ్లీ రాజకీయ సంక్షోభం రాజుకుంటున్నది. తన పదవికి రాజీనామా చేస్తానని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మొహమ్మద్ యూనస్ హెచ్చరించినట్లు వార్తలు వెలువడ్డాయి. ఆర్మీ చీఫ్‌కి వ్యతిరేకంగా మరో ఉద్యమాన్ని నిర్వహించాలన్న ఆలోచనతోనే యూనస్ రాజీనామా బెదిరింపులు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ప్రస్తుత రాజకీయ వాతావరణం, నిరసనల మధ్య తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేకపోతున్న కారణంగానే రాజీనామా చేయాలని యూనస్ యోచిస్తున్నట్లు విద్యార్థులు ఏర్పాటు చేసుకున్న నేషనల్ సిటిజన్ పార్టీ(ఎన్‌సీపీ) కన్వీనర్, విద్యార్థి ఉద్యమ నాయకులలో ఒకరైన నహీద్ ఇస్లామ్ బీబీసీకి తెలిపారు. డిసెంబర్ కల్లా దేశంలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది యువజనులు, బీఎన్‌పీ కార్యకర్తలు బుధవారం ఢాకాలో ప్రదర్శన నిర్వహించారు. డిసెంబర్ కల్లా జా తీయ ఎన్నికలు జరగాలని, వెంటనే ఇందుకు సన్నాహాలు ప్రారంభించాలని బీఎన్‌పీ తాత్కాలిక చైర్మన్ తారీఖ్ రెహ్మాన్ డిమాండు చేశారు. లండన్ నుంచి వర్చువల్‌గా ఆయన ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించారు. యూనస్ ఆశీస్సులతో కొత్తగా విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పడిన నేషనల్ సిటిజెన్ పార్టీకి వ్యతిరేకంగా తమ బలాన్ని ప్రదర్శిస్తూ వేలాది మంది విద్యార్థులు నేటి ర్యాలీలో పాల్గొన్నారు.

# 'మోదీ జీ.. ఎవరి సత్తా ఏంటో ఎన్నికల్లో చూస్కుందాం'



**కోల్‌కతా:** ప్రధాని నరేంద్ర మోదీ పశ్చిమబెంగాల్ పర్యటనలో మమతా బెనర్జీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. మమతా బెనర్జీ ప్రభుత్వం ఒక అవినీతి ప్రభుత్వమని, హింసాత్మక ప్రభుత్వమని ప్రధాని మోదీ ఘాటుగా విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం పశ్చిమబెంగాల్ ప్రజలు.. మమతా బెనర్జీ ప్రభుత్వం అరాచకాలపై కన్నీళ్లు పెట్టుకుంటున్నారంటూ మోదీ వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్ లో ప్రభుత్వాన్ని మార్చాల్సిన సమయం ఆసన్నమైందని కూడా ప్రజల భావనగా ఉందని మోదీ తెలిపారు. దీనికి సీఎం మమతా బెనర్జీ తనదైన శైలిలో జవాబిచ్చారు. తాను ప్రధాని మోదీ తరహాలో వ్యాఖ్యానించలేనంటూనే వచ్చే ఎన్నికల్లో ఎవరి సత్తా ఏమిటో తెలుస్తుందన్నారు. రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఎవరి పక్షాన ఉన్నారో అనేది తేలుతుందని మోదీకి సవాల్ విసిరారు. మోదీ వ్యాఖ్యలపై కౌంటర్ రిప్లై ఇచ్చిన మమతా.. ' ఎన్నికలు రానివ్వండి. చూద్దాం.. ఎవరి సత్తా ఏమిటో తేలుతుంది. ప్రజలు ఎవరు పక్షాన ఉన్నారో చూద్దాం. మా వెంట, మా పార్టీ వెంట రాష్ట్ర ప్రజలు ఉన్నారని నేను బలంగా నమ్ముతున్నా. ఎవరి సత్తా ఏమిటో ఎన్నికల్లో చూస్కుందాం' అని మోదీకి మమతా సవాల్ విసిరారు. ఈరోజు(గురువారం) ప్రధాని మోదీ పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని అలీపుర్ద్వార్ బహిరంగ సభలో మాట్లాడుతూ.. మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని తూర్పార బట్టారు. పశ్చిమ బెంగాల్ ఎక్కడ చూసినా అవినీతి, అల్లర్లు, హింస ఇవే కనిపిస్తున్నాయంటూ విమర్శలు చేశారు. పశ్చిమ బెంగాల్ లో ఎన్నికలకు ఇంకా ఏడాది సమయం కూడా లేదు. వచ్చే ఏప్రిల్ నెలలో పశ్చిమ బెంగాల్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఈ తరుణంలో ప్రధాని మోదీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

# బెంగాల్‌లో 'నిర్మమత సర్కార్'



**ఇంటర్నెట్‌డెస్క్:** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీని ఉద్దేశించి ప్రధాని నరేంద్రమోదీ తీవ్ర విమర్శలు చేశారు. ప్రస్తుతం రాష్ట్రం వరుస సంక్షోభాలతో సతమతమవుతోందని అన్నారు. ముర్షిదాబాద్, మాల్డాలో చోటుచేసుకున్న ఘర్షణలు ఆమె ప్రభుత్వ క్రూరత్వం, ఉదాసీనతకు నిదర్శనమని ధ్వజమెత్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో 'నిర్మమత (దయలేని) ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. ఆ రాష్ట్రంలో నిర్వహించిన ర్యాలీలో ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఇటీవల మాల్డా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పలు ప్రధాన రహదారులు, రైల్వే ట్రాక్‌లను దిగ్బంధించారు. ఈ క్రమంలోనే పోలీసులపైనా ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో లాఠీఛార్జ్‌కి దారితీసింది. ముర్షిదాబాద్ ప్రాంతంలో పోలీసు వాహనాలకు నిప్పు పెట్టడం వంటి ఘటనలతో అక్కడ విధ్వంసానికి దారితీసింది ఈ ఘర్షణలపై కలకత్తా హైకోర్టు నియమించిన నిజనిర్ధారణ కమిటీ ఇచ్చిన నివేదికతో ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వక్ఫ్‌చట్ట వ్యతిరేక నిరసనల ఫలితంగా చెలరేగిన మతపరమైన ఘర్షణలకు స్థానిక ఎమ్మెల్యే, నాయకులు కారణమని నివేదిక ప్రస్తావించింది. ఆ సమయంలో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని ఎత్తిచూపింది. ఈ వ్యవహారం భాజపా చేతిలో అస్త్రంగా మారింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల జరగనున్న నేపథ్యంలో తాజా ర్యాలీలో మమత ప్రభుత్వాన్ని మోదీ ఎండగట్టారు. "రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ వ్యక్తులు కొన్ని ఇళ్లను గుర్తించి తగులబెడుతుంటే, పోలీసులు దానిని అడ్డుకోకుండా చూస్తూ ఉంటే.. అది ఎంతటి భయానక పరిస్థితో అర్థంచేసుకోండి. ఇక్కడి ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం లేదు. ప్రభుత్వాన్ని నడిపేది ఇలాగేనా..? బుజ్జగింపు రాజకీయాల పేరిట గూండాలకు స్వేచ్ఛనిచ్చారు. ఇక్కడ ప్రతి సమస్యకు కోర్టు జోక్యం చేసుకోవాల్సి వస్తుంది. లేకపోతే ఏదీ పరిష్కారం కాదు" అని మోదీ దుయ్యబట్టారు.

**పాక్ గడ్డపై మూడుసార్లు దాడులు..**

ఈ ర్యాలీలో ఆపరేషన్ సిందూర్ గురించి ప్రస్తావించారు. "ఆ ఆపరేషన్ ఇంకా పూర్తికాలేదని బెంగాల్ గడ్డ మీద నిలబడి, 140 కోట్ల మంది భారతీయుల తరఫున ప్రకటిస్తున్నాను. ఏప్రిల్ 22 జరిగిన పహల్గాం ఉగ్రదాడిపై బెంగాల్‌లో కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. సిందూరం శక్తి ఏంటో మన ఆర్మీ ఉగ్రవాదులకు రుచి చూపించింది. మనం వారి ఇంట్లోకి ప్రవేశించి, మూడుసార్లు దాడులు చేశామని పాకిస్థాన్ అర్థం చేసుకోవాలి" అని అన్నారు. 2016లో జరిగిన సర్జికల్ స్ట్రైక్స్, 2019లో జరిగిన బాలాకోట్ దాడులు, ఇప్పటి ఆపరేషన్ సిందూర్‌ను ఉద్దేశించి మోదీ పరోక్షంగా ప్రస్తావించారు.

# పాకిస్తాన్‌కు గూఢచర్యం.. ప్రభుత్వ ఉద్యోగి అరెస్ట్

**ఢిల్లీ:** భారత్‌లో విస్తరించిన పాకిస్తాన్ నిఘా సంస్థలకు సంబంధించిన సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే పాకిస్తాన్‌కు గూఢచర్యం చేస్తున్న పలువురిని అరెస్ట్ చేశారు. ఇక, తాజాగా మరో ప్రభుత్వ ఉద్యోగి గూఢచర్యం ఆరోపణలపై అరెస్టయ్యాడు. అతడి ఫోన్‌లో పాకిస్తాన్‌కు చెందిన పలు నంబర్లు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన ప్రభుత్వ ఉద్యోగి సకూర్ ఖాన్ మగళియార్ గూఢచర్యం ఆరోపణలపై అరెస్టయ్యాడు. సకూర్ ఖాన్ స్టేట్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్‌లో పనిచేస్తున్నాడు. తాజాగా సకూర్ ఖాన్‌ను సీఐడీ, ఇంటెలిజెన్స్ బృందాలు అదుపులోకి తీసుకొన్నాయి. ఈ సందర్భంగా ఎస్పీ సుధీర్ చౌధ్రీ మాట్లాడుతూ.. సకూర్‌ఖాన్‌పై గత కొన్ని వారాలుగా దర్యాప్తు బృందాలు నిఘా పెట్టాయి. అతడికి పాక్ దౌత్య కార్యాలయంతో సంబంధాలపై కూడా సందేహాలున్నాయి. సకూర్ అనుమానాస్పద కార్యకలాపాల గురించి ఉన్నత స్థాయి నుంచి సమాచారం అందింది. దీంతో వాటిని ప్రశ్నించి.. నిర్ధారించుకునేందుకు అరెస్ట్ చేసినట్టు తెలిపారు. ఇక, సకూర్ ఖాన్ ఫోన్‌లో పలు పాకిస్థానీ నంబర్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటి గురించి సంతృప్తికరమైన వివరణ మాత్రం అతడి నుంచి రావడం లేదని దర్యాప్తు బృందాలు చెబుతున్నాయి. పాక్‌ను దాదాపు ఏడుసార్లు సందర్శించినట్లు అతడు అంగీకరించాడు. ఇప్పటివరకు అతడి ఫోన్‌లో ఎటువంటి మిలిటరీ సమాచారం లేదని అధికారులు వెల్లడించారు. కాకపోతే కొన్ని ఫైల్స్‌ను అతడు డిలీట్ చేసినట్లు గుర్తించారు. ఇక ఖాన్‌కు ఉన్న రెండు బ్యాంకు ఖాతాలపై దృష్టిసారించారు. ఇదిలా ఉండగా.. సకూర్ ఖాన్ స్వస్థలం పాక్ సరిహద్దుల్లోని జైసల్మేర్ జిల్లా బరోడా గ్రామంలోని మంగళియార్ ధాని. ఇతడు గత రాష్ట్ర ప్రభుత్వంలో ఓ మంత్రికి వ్యక్తిగత సహాయకుడిగా కూడా పనిచేయడం సంచలనంగా మారింది. సదరు మాజీ మంత్రిది కూడా ఇదే గ్రామం కావడం గమనార్హం. దర్యాప్తు వర్గాలు మాత్రం రాజకీయ లింక్‌లపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు.

## చిరునామా కనుగొనడంలో ఇబ్బందులకు ఇక చెక్!




**న్యూఢిల్లీ :** మహానగరాల్లో కొత్తవారు ఏదైనా ఒక అడ్రస్ కనుగొనడమంటే కత్తి మీద సాము చేయడం వంటిదే. గూగుల్ మ్యాప్ సైతం కచ్చితత్వంతో మనం కోరుకున్న చిరునామాకు మనలను తీసుకెళ్లలేకపోతున్నది. కొన్నిసార్లు మనం వెళ్లదలచుకున్న ప్రదేశాన్ని సమీపంలోని బండగుర్తు (ల్యాండ్‌మార్క్) ఆధారంగా కనుగొనాల్సి వస్తుంది. ఈ సమస్యలన్నింటికీ చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రతి ఇంటికి (చిరునామాకు) ఆధార్ తరహాలో ఓ ప్రత్యేకమైన డిజిటల్ గుర్తింపు నంబర్ ఇవ్వనున్నట్టు తెలిసింది. దీంతో ప్రతి భారతీయుడి నివాసానికి అధికారికమైన ఓ ప్రత్యేక గుర్తింపు నంబర్ (డిజిపిన్ నంబర్) లభించనుంది. తాను నివసిస్తున్న ప్రదేశానికి భవిష్యత్తులో ఇదే ఐడీ ప్రూఫ్‌గా మారనుంది. నివాసాలను, ప్రదేశాలను కచ్చితంగా, వేగంగా కనుగొనే లక్ష్యంగా ఈ ప్రత్యేక డిజిటల్ ఐడీ నంబర్ పంపిణీకి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్టు ఓ ఆంగ్ల పత్రిక వార్తా కథనాన్ని ప్రచురించింది. ప్రస్తుతమున్న భౌతిక చిరునామాలను డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) వ్యవస్థలో అనుసంధానం చేయడానికి కేంద్రం సన్నాహాలు చేస్తున్నది. ప్రస్తుతం దేశంలో అడ్రస్‌ల డాటాను నిర్వహించేందుకు ఓ ప్రామాణికమైన వ్యవస్థ అందుబాటులో లేదు. దీంతో ఈ పరిస్థితిని ఆసరా చేసుకొని చాలామంది తప్పుడు అడ్రస్‌లతో మోసాలకు పాల్పడేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు ఈ చిరునామాల డాటాకు సంబంధించి దేశంలో స్పష్టమైన నియమ నిబంధనలు అమలులో లేకపోవడంతో పలు ప్రైవేటు కంపెనీలు పౌరుల వద్ద వారి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి, వారి అనుమతి లేకుండానే ఇతరులతో పంచుకుంటున్నాయి. ప్రభుత్వం అమలుచేయనున్న కొత్త డిజిటల్ ఐడీలతో ఈ అక్రమాలన్నింటికీ అడ్డుకట్టవేయవచ్చని ఆ పత్రిక కథనం వివరించింది. డిజిటల్ ఐడీలతో పౌరుల వ్యక్తిగత వివరాలు వారి నియంత్రణలో ఉండిపోతాయి. ఎవరైనా ఆ వివరాలను పొందాలంటే ఇకపై సదరు వ్యక్తి అనుమతి ద్వారానే సాధ్యం కానుంది.

## కాంట్రాక్టులపై సంతకాలు చేస్తారు.. డెలివరీలు జరగవు




**ఇంటర్నెట్‌డెస్క్:** రక్షణ రంగంలోని ప్రధాన కాంట్రాక్టులపై సంతకాలు జరుగుతాయి కానీ.. డెలివరీలు మాత్రం మొదలుకావని వాయుసేన అధిపతి ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఐఐ వార్షిక సమావేశంలో ఆయన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలోనే ఈ వ్యాఖ్యలు చేశారు. "చాలా సార్లు కాంట్రాక్టులపై సంతకాలు జరుగుతాయి.. కానీ, సిస్టమ్స్ (ఆయుధాలు) మాత్రం ఎప్పటికీ అందవు. టైమ్‌లైన్ ప్రధాన సమస్య. సకాలంలో పూర్తయిన ఒక్క ప్రాజెక్టు కూడా నాకు గుర్తుకురావడంలేదు. మనం చేయలేని పనికి ఎందుకు వాగ్దానాలు చేయడం? తేజస్ ఎంకే1 చాలా ఆలస్యమైంది. ఇక తేజస్ ఎంకే2 ప్రొటోటైప్ కూడా అందుబాటులోకి రాలేదు. ఇక ఆమ్కా ఫైటర్‌కు సంబంధించి ఇప్పటి వరకు నమూనా విమానం కూడా రాలేదు. మన దళాలు.. పరిశ్రమ మధ్య విశ్వాసం పెరగాల్సిన అవసరం ఉంది. పారదర్శకత చాలా అవసరం. మనం ఒక్కసారి దేనికైనా కట్టుబడితే.. దానిని అందించి తీరాల్సిందే. మేకిన్ ఇండియా కోసం వాయుసేన శక్తివంచన లేకుండా కృషి చేస్తోంది. మనం ఈ రోజు సంసిద్ధంగా ఉంటేనే.. భవిష్యత్తుకు సన్నద్ధం కాగలము. రానున్న పదేళ్లలో.. మన పరిశ్రమలు ఉత్పత్తిని గణనీయంగా పెంచగలవు. కానీ, ప్రస్తుతానికి మనం త్వరగా చర్యలు తీసుకోవడం అవసరం. దళాలను శక్తిమంతం చేసుకొంటేనే యుద్ధాలు గెలుస్తాం" అని పేర్కొన్నారు.

**యుద్ధ రంగం వేగంగా మారిపోతోంది!**

యుద్ధ రంగంలో వేగంగా మారిపోతున్న సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని ఎయిర్ మార్షల్ ఏపీ సింగ్ సూచించారు. "మన నౌకాదళాధిపతి చెప్పినట్లు యుద్ధ రంగం వేగంగా మారిపోతోంది. ప్రతి రోజు సరికొత్త టెక్నాలజీలు అందుబాటులోకి వస్తున్నట్లు చూస్తున్నాం. ఆపరేషన్ సిందూర్‌తో.. మనం ఎక్కడ ఉన్నాం.. భవిష్యత్తుకు ఏం కావాలనే దానిపై స్పష్టమైన అవగాహన వచ్చింది. మనం చేయాల్సింది చాలా ఉంది. ఆమ్కా ప్రాజెక్టును ప్రైవేటు సెక్టార్ కోసం కూడా క్లియర్ చేశారు. ఇది చాలా పెద్ద నిర్ణయం. మన ప్రైవేటు రంగంపై దేశానికి ఆ స్థాయిలో విశ్వాసం ఉంది. భవిష్యత్తులో భారీ మార్పులకు ఇది బాటలు పరుస్తుంది" అని పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరిలో కూడా వాయుసేనాధిపతి తేజస్ డెలివరీలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "తయారీ సంస్థలు ఉత్పత్తి వేగం పెంచడానికి అత్యాధునిక వ్యవస్థలపై పెట్టుబడులు పెట్టాలి. వారి మానవ వనరుల నైపుణ్యాలకు మెరుగులు దిద్దాలి. తేజస్ తొలి ఎయిర్ క్రాఫ్ట్ 2001లోనే గాల్లోకి ఎగిరింది. 2016 నుంచి ఇప్పటి వరకు తొలి 40 విమానాల డెలివరీ కూడా పూర్తికాలేదు" అని నాడు ఆయన వ్యాఖ్యానించడం సంచలనం సృష్టించింది.

## 'ఇంకా ఎక్కువే చేయగలం' పాక్‌కు రాజ్‌నాథ్ హెచ్చరిక

**న్యూఢిల్లీ:** 'చేయాలనుకుంటే మనం ఇంకా ఎక్కువే చేయగలం. అయితే ప్రపంచానికి సంయమనం అనే సందేశాన్ని అందించాలనే ఉద్దేశంతోనే వెనకకు తగ్గాం. ఒక ఉదాహరణగా నిలిచాం' అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మరోమారు పాకిస్తాన్‌ను హెచ్చరించారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్తాన్ రెచ్చగొట్టే చర్యలకు దిగినప్పటికీ, భారతదేశం సంయమనంలో మెలిగిందని, మన సైన్యం ప్రపంచం ఎదుట వ్యూహాత్మక సమన్వయాన్ని ప్రదర్శించాలని నిర్ణయించుకున్నదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈరోజు (గురువారం) న్యూఢిల్లీలో జరిగిన సీఐఐ వార్షిక సర్వసభ్య సమావేశంలో రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ భద్రత, స్వావలంబనలోని ద్వంద్వ లక్ష్యాలను నొక్కిచెప్పారు, భారతదేశ రక్షణ సంసిద్ధతను బలోపేతం చేయడంలో 'మేక్ ఇన్ ఇండియా' చొరవను ఆయన ప్రశంసించారు. తాము మొదట ఉగ్రవాద స్థావరాలను, ఆపై శత్రువుల సైనిక స్థావరాలను, వైమానిక స్థావరాలను ఎలా నాశనం చేశామనేది అందరూ చూశారన్నారు. మనం ఇంకా ఎక్కువ చేయగలిగినప్పటికీ సంయమనం పాటించామని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి భారతదేశం నుంచి వచ్చిన సైనిక ప్రతిస్పందన 'ఆపరేషన్ సిందూర్' ఒక కొలత కలిగిన నిర్ణయాత్మక దాడి రాజ్‌నాథ్ అన్నారు. భవిష్యత్‌లో పాక్‌తో ఎప్పుడు చర్చలు జరిగినా అవి ఉగ్రవాదం, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ గురించి మాత్రమే ఉంటాయి. పాకిస్తాన్‌తో మరే ఇతర అంశంపై చర్చ ఉండదని రాజ్‌నాథ్ ప్రకటించారు. పీఓకే ప్రజలు మన కుటుంబ సభ్యులు. భౌగోళికంగా, రాజకీయంగా మన నుండి వేరయిన మన సోదరులు, ఏదో ఒక రోజు వారు ఖచ్చితంగా భారత ప్రధాన స్రవంతిలోకి తిరిగి వస్తారని గట్టిగా నమ్ముతున్నామని రాజ్‌నాథ్ అన్నారు. దశాబ్దాలుగా విడిగా ఉంటున్నప్పటికీ, పీఓకే-భారత ప్రజల మధ్య భావోద్వేగ , సాంస్కృతిక బంధం బలంగా ఉందని రాజ్‌నాథ్ పేర్కొన్నారు.

# మాకూ కేబినెట్‌లో చోటివ్వండి!

**ఢిల్లీ :** తెలంగాణ కేబినెట్ విస్తరణ పంచాయితీ మరోసారి ఢిల్లీకి చేరింది. తెలంగాణ కేబినెట్ విస్తరణకు సంబంధించి కాంగ్రెస్ అధిష్టానం పలుమార్లు చర్చలు జరిపి ఇప్పటికే నివేదిక సిద్ధం చేసి పెండింగ్ లో పెట్టింది. తెలంగాణ కేబినెట్ పునఃవ్యవస్థీకరణలో మంత్రి పదవులు తమకు కావాలంటే తమకు కావాలనే కాంగ్రెస్ నేతలు వరుసగా ఢిల్లీకి క్యూకట్టిన తరుణంలో ఆ నివేదికను అధిష్టానం పక్కన పెట్టేసింది. అయితే ప్రస్తుతం మాదిగ కులానికి చెందిన తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇప్పుడు ఢిల్లీకి చేరుకున్నారు. తమ కులానికి కూడా కేబినెట్ లో పెద్ద పీట వేయాలని వారు పట్టుబడుతున్నారు. తెలంగాణ కేబినెట్ విస్తరణలో తమ కులానికి అవకాశం కల్పించాలంటూ అధిష్టానం పెద్దలను కలవడానికి వారు సిద్ధమయ్యారు. దీనిలో భాగంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో పాటు ఏఐసీసీ నేత కేసీ వేణుగోపాల్ అపాయింట్ మెంట్ కోరారు.



**మాది న్యాయమైన డిమాండ్..**

'మంత్రివర్గంలో మాదిగ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం గురించి సీఎం, పీసీపీ, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ కి తెలిపే ఢిల్లీ వచ్చాం. మాది న్యాయమైన డిమాండ్. మాదిగ కులస్తునికి ఖచ్చితంగా కేబినెట్ లో స్థానం కల్పించాలి. తెలంగాణలో మాదిగ సామాజికవర్గం పెద్ద సామాజిక వర్గం. మాదిగ సామాజిక వర్గ ప్రజలకు న్యాయం జరగాలంటే మంత్రివర్గంలో మాదిగ సామాజిక వర్గ ప్రతినిధి ఉండాలి. మాదిగ వర్గం మొదటి నుంచి కాంగ్రెస్ కి అండగా ఉంది. మాలలకు మంత్రివర్గంలో స్థానం కల్పించడం పట్ల మాకు అభ్యంతరం లేదు. మంత్రివర్గంలో ఎవరుండాలనేది నిర్ణయించేది అధిష్టానం కాబట్టి ఢిల్లీ వచ్చాం. మంత్రివర్గంలో మాదిగలకు కచ్చితంగా స్థానం లభిస్తుందని ఆశిస్తున్నాం. మొదటి కేబినెట్ ఏర్పాటులో మాకు అవకాశం దక్కుతుందని భావించాం. ఇప్పుడు రెండోసారి కేబినెట్ విస్తరణ జరుగుతుంది కాబట్టి ఇప్పుడు మరోసారి మాకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నాం. మాదిగ సామాజిక వర్గంలో ఏ ఎమ్మెల్యేకు అవకాశం ఇచ్చిన మాకు అభ్యంతరం లేదు' అని వారు స్పష్టం చేశారు. అడ్లూరు లక్ష్మణ్, మందుల సామెల్, కవ్వం పల్లి సత్యనారాయణ, లక్ష్మీ కాంతారావు ఢిల్లీకి వెల్లిన వారిలో ఉన్నారు,. ఈరోజు(గురువారం) అధిష్టానం పెద్దలను వీరు కలిసే అవకాశం ఉంది.

# సొంత పార్టీ వాళ్లే ఓడించారు

-మొదటిపేజీ తరువాయి

ప్రతిపాదన వస్తే వ్యతిరేకించా భారాసను గంపగుత్తగా భాజపాకు అప్పగించాలన్న ప్రయత్నం జరుగుతోంది. జైలులో ఉన్నప్పుడే ఆ ప్రతిపాదన వస్తే నేను వ్యతిరేకించాను. భాజపాలో భారాస విలీనం కాకుండా స్వతంత్రంగా ఉండాలన్నదే నా అభిమతం. నాపై దుష్ప్రచారం చేస్తున్నా పార్టీ స్పందించలేదు. నన్ను పార్టీ నుంచి ఎవరు బయటకు పంపుతారు?.. అంత సీన్ లేదు. కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరిపినట్లు జరుగుతున్న ప్రచారం శుద్ధ అబద్ధం. భారాసలో కేసీఆర్ మాత్రమే నాకు నాయకుడు.. ఆయన నాయకత్వంలోనే పనిచేస్తాను. వెన్నుపోటు పొడవడం నా లక్షణం కాదు... నేరుగానే పోరాడతాను. కొత్త పార్టీ అవసరం లేదు.. ఉన్న పార్టీని బాగా చూసుకుంటే చాలు. లేఖలో నేను చేసిన సూచనల్లో ఒక్కటైనా తప్పుందా? కేసీఆర్‌ను నడిపించేంత పెద్దవాళ్లు అయ్యారా? కడుపులో విషం పెట్టుకుని బయటకు నవ్వుతూ ఉండలేను. నా తండ్రికి వందల లేఖలు రాశాను.. తప్పేంటి?సాధారణంగా కేసీఆర్ లేఖను చదివాక చింపుతారు. ఈసారి అలా చింపలేదు. కుట్ర ఎవరు చేశారో నాకు తెలియదు... బయటపెట్టాలని అంటున్నాను. లీకు వీరుడా.. లీకు వీరులా? అనేది తెలియాలి.



**కడుపులో బిడ్డను పెట్టుకుని ఉద్యమంలో పనిచేశా**

దేశం వెలుపల ఐటీ సెల్‌లు పెట్టి నాపై పోరాడుతామంటే ఎలా?దొంగల్ని పట్టుకోమంటే చేతగాక నాపై ప్రతాపం చూపితే ఎలా? పార్టీ నాది అని ప్రతి ఒక్కరూ పోరాడితేనే ఫలితం ఉంటుంది. కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే.. కేవలం 'ఎక్స్'లో పోస్టు పెట్టి వదిలేస్తే ఎలా? నేను ఏనాడూ పదవుల కోసం పోరాడలేదు. కడుపులో బిడ్డను పెట్టుకుని తెలంగాణ ఉద్యమంలో సైనికురాలిగా పనిచేశాను. నన్ను విమర్శిస్తున్న నేతలు కేసీఆర్ నీడన ఉన్నారు తప్ప.. చేసిన కార్యక్రమాలు ఏమున్నాయి? వర్కింగ్ ప్రెసిడెంట్‌కు ఇవ్వాల్సిన ప్రొటోకాల్.. గౌరవం ఉంటుంది. తెలంగాణ జాగృతి ఉద్యమ సంస్థ.. అది ఇవాళ పుట్టింది కాదు. పార్టీ చేయని కార్యక్రమాలను జాగృతి తరఫున చేస్తున్నాను. సాంస్కృతిక, సమకాలీన అంశాలపై బలంగా పోరాడాం.

**నన్ను, కేసీఆర్‌ను విడదీసే కుట్ర..**

నా తండ్రిని, నా కుటుంబాన్ని వదిలి నేనెందుకు వెళ్తాను?నా కుటుంబానికి నన్ను దూరం చేసే ప్రయత్నం జరుగుతోంది. దూరం చేస్తే ఎవరికి లాభం జరుగుతుందో ఆలోచించుకోవాలి. నన్ను, కేసీఆర్‌ను విడదీసే కుట్ర చేస్తున్నారు. నేను ఎవరి నాయకత్వం కింద పనిచేయను.. కేసీఆర్ మాత్రమే నాకు నాయకుడు. దామోదర్‌రావు, గండ్ర మోహన్‌రావును ఎవరు పంపారో నాకు తెలియదు. వాళ్లిద్దరూ ఎవరికి దగ్గరో తెలుసు కదా! వేరే నేత అంశంలో స్పందించిన పార్టీ.. నా విషయంలో ఎందుకు స్పందించడం లేదు? భారాస బలహీనమైతే కాంగ్రెస్, భాజపాలకు లాభం చేకూరుతుంది. కేసీఆర్ ఎలాంటి తప్పు చేయలేదు. ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు.. అందులో ఎలాంటి అనుమానం లేదు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి కానీ.. 'ఎక్స్'లో పోస్టులకు పరిమితమైతే ఎలా?" అని కవిత ఘాటుగా వ్యాఖ్యానించారు.

# కాలం చెల్లిన రూపాయి మోదీ

**మేడ్చల్:** భారతదేశ భద్రత విషయంలో అందరం ఏకమవ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్ణయాలకు అండగా నిలిచామని ఉద్ఘాటించారు. దేశంపై పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు పేట్రేగిపోతున్నారని ధ్వజమెత్తారు. ఉగ్రవాదులను తుదముట్టించేవరకు సైన్యానికి అండగా ఉంటామని తెలిపారు. ఏఐసీసీ పిలుపుమేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గంలో గురువారం జై హింద్ యాత్ర నిర్వహించారు. బాచుపల్లి వీఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇంజనీరింగ్ కాలేజీ నుంచి వీఎన్ఆర్ కన్వెన్షన్ వరకు జైహింద్ యాత్ర కొనసాగింది.

**గతంలో కుట్ర చేసి ఓడించారు...**

ఈ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. జై హింద్ యాత్ర అనంతరం నిజాంపేట కొలన్ గోపాల్‌రెడ్డి కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కుట్ర చేసి కొడంగల్‌లో తనను ఓడిస్తే.. 14 రోజుల్లోనే మల్కాజ్‌గిరిలో ఎంపీగా గెలిపించారని ఉద్ఘాటించారు. అనంతరం తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎంపిక య్యానని.. ఇప్పుడు తెలంగాణ సీఎంగా ప్రజల ముందుకు వచ్చానని గుర్తుచేసుకున్నారు సీఎం రేవంత్‌రెడ్డి.

"ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా నెక్లెస్ రోడ్డులో ర్యాలీ చేశాం. పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పాలని మోదీకి మద్దతు తెలిపాం. 4 రోజుల యుద్ధం తర్వాత ఏం జరిగిందో తెలియదు. కానీ, యుద్ధం ఆపేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీడియా ముందుకు వచ్చి యుద్ధం తానే ఆపానని ప్రకటించారు. యుద్ధానికి మద్దతివ్వాలని అఖిలపక్షం నిర్వహించిన ప్రధాని మోదీ.. యుద్ధం ఆపే విషయంలో ఎందుకు చర్చించలేదు. గుండెల్లో ధైర్యం ఉన్న నాయకుడే యుద్ధాన్ని గెలిపిస్తాడు. గతంలో ఇందిరాగాంధీ చైనాను మోకాళ్లపై కూర్చోబెట్టారు. గల్వాన్ ఘటనలో మన కర్నల్ సంతోష్‌ను పొట్టన పెట్టుకుంటే ఏమీ చేయలేకపోయాం. 1971లో అమెరికా అండతో పాకిస్థాన్ మనపై యుద్ధానికి వచ్చింది. యుద్ధం ఆపాలని అప్పటి అమెరికా అధ్యక్షుడు... ఇందిరాగాంధీని బెదిరించారు. కానీ, ఆమె బెదిరింపులకు లొంగలేదు. పాక్‌ను ఓడించి.. ఆ దేశాన్నే రెండు ముక్కలు



చేశారు" అని రేవంత్ అన్నారు.

**యుద్ధం అంటే ధైర్యం..**

పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పే విషయంలో కేంద్రానికి సహకరించామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యుద్ధం అంటే ధైర్యం, వెన్నెముక, యుద్ధతంత్రం ఉండాలని చెప్పుకొచ్చారు. నాలుగు రోజుల యుద్ధం తర్వాత అర్ధాంతరంగా ఎందుకు ఆపేశారని ప్రశ్నించారు. యుద్ధం చేయాలనుకున్నప్పుడు అఖిలపక్షాన్ని పిలిచారని.. యుద్ధం ఆపేసినప్పుడు అఖిలపక్షాన్ని ఎందుకు పిలవలేదని ప్రశ్నల వర్షం కురిపించారు సీఎం రేవంత్‌రెడ్డి. గుండెల్లో ధైర్యం ఉన్న నాయకుడే యుద్ధాన్ని గెలిపిస్తారని తెలిపారు. అమెరికా ఒత్తిడికి తలొగ్గి యుద్ధాన్ని అర్ధంతరంగా ఆపేశారా అని నిలదీశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీడియా ముందుకు వచ్చి యుద్ధం ఆపానని ప్రకటించారని గుర్తుచేశారు. అమెరికా ఒత్తిడికి తలొగ్గి యుద్ధాన్ని అర్ధాంతరంగా ఆపేశారా అని ప్రశ్నించారు. పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పడానికి సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని కోరారు. పీవోకేను స్వాధీనం చేసుకోవాలని మోదీతో తాము చెప్పామని అన్నారు. 1971 యుద్ధంలో పాకిస్థాన్‌ను ఓడించామని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు.

**ఇందిరాగాంధీని మోదీ స్ఫూర్తిగా తీసుకోవాలి**

'భారత్ వైపు ఎవరు కన్నెత్తి చూసినా కనుగుడ్లు పీకేస్తామని.. చైనాకు ఇందిరాగాంధీ వార్నింగ్ ఇచ్చారు. గతంలో యుద్ధం ఆపాలని ఇందిరాగాంధీని అప్పటి అమెరికా అధ్యక్షుడు బెదిరించారు. ఇందిరాగాంధీ అమెరికా బెదిరింపులకు లొంగలేదు. నాటి ఇందిర యుద్ధతంత్రాన్ని ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. ఇందిరాగాంధీని ప్రధాని మోదీ స్ఫూర్తిగా తీసుకోవాలి. 1967 చైనా, 1971లో పాకిస్థాన్‌ని ఓడించినందుకా కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారు. మోదీకి వీరతిలకం దిద్ది పాకిస్థాన్‌పై యుద్ధం చేయాలని చెబితే.. ఎందుకు వెనుకడుగు వేశారో బీజేపీ నేతలే చెప్పాలి. ట్రంప్ బెదిరించగానే మోదీ ఎందుకు తలొగ్గారు. ఇది దేశ భద్రతకు సంబంధించిన అంశం.. మీ సొంత వ్యవహారం కాదు. భారతీయుల ఆత్మగౌరవాన్ని ట్రంప్ దగ్గర తాకట్టు పెడతారా. యుద్ధం అంటే ఉపన్యాసాలు చెప్పడం కాదు. దేశ ప్రజలకు ప్రధాని మోదీ సమాధానం చెప్పాలి. మేం నిర్వహించిన ర్యాలీ ఎన్నికలు, ఓట్ల కోసం కాదు..సైనికుల ఆత్మస్థైర్యం, ఆత్మగౌరవం నిలబెట్టడానికి. కాలం చెల్లిన రూపాయి ప్రధాని మోదీ. దేశానికి రాహుల్‌గాంధీ నాయకత్వం అవసరం. బలూచిస్థాన్‌ను విడగొట్టి మరో దేశంగా చేయమన్నాం. ఇది చేతకాదు కానీ.. కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారు. యుద్ధంలో ఎన్ని రఫెల్ విమానాలు నేలకూలాయో లెక్క చెప్పండి. పాక్‌ను ఓడించాలంటే ఇందిరాగాంధీ మార్గంలో..నడవాలని ప్రధాని మోదీకి సూచించాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## పాస్ పోర్ట్ వచ్చిన మూడు రోజుల్లో ఇండియాకు రావాలి

**న్యూ ఢిల్లీ :** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నింధితుడిగా ఉన్న మాజీ ఐపిఎస్ ప్రభాకర్ రావుకు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. గురువారం ప్రభాకర్ రావు వేసిన పిటిషన్ ను విచారించిన కోర్టు.. ఆయనకు పాస్‌పోర్ట్ ఇవ్వాలని ఆదేశించింది. పాస్ పోర్ట్ వచ్చిన మూడు రోజుల్లో ఇండియాకు రావాలని.. విచారణకు పూర్తిగా సహకరించాలని ప్రభాకర్ రావును ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణ వరకు ప్రభాకర్‌రావును అరెస్ట్ చేయొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన సుప్రీం.. తదుపరి విచారణ ఆగస్ట్ 5వ తేదీకి వాయిదా వేసింది. కాగా, ప్రస్తుతం అమెరికాలో ఉన్న ప్రభాకర్ రావుకు అక్కడి కోర్టుల షాకిచ్చింది. తనపై రాజకీయ కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని.. తనను రాజకీయ శరణార్థిగా గుర్తించాలని కోరుతూ ప్రభాకర్ రావు వేసిన పిటిషన్ ను కోర్టు తిరస్కరించింది.

## ప్రభుత్వం రైతాంగానికి అండ..

-మొదటిపేజీ తరువాయి

జరుగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎంతోపాటు ఇన్చార్జ్ మంత్రులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతాంగానికి అండగా నిలబడిందని, ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతాంగానికి వారం రోజుల్లలో వారి ఎకౌంట్లలో డబ్బులు వేస్తామని భట్టి విక్రమార్క చెప్పారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ విజయమని, రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు అందరికీ ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నానని భట్టి విక్రమార్క అన్నారు.

**అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు..**

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ఐదు లక్షల రూపాయలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తున్నామని, ప్రతి నియోజకవర్గానికి ఒకేసారి 3,500 కేటాయించి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి నిరంతరం ఇళ్ల మంజూరు ప్రక్రియ జరుగుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్లు ఇస్తామని చెప్పి మోసం చేశారని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో పేదలతో ఆడుకున్నారని భట్టి విక్రమార్క విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి దశలో నాలుగు లక్షల 50 వేల ఇళ్లు మంజూరు చేసి పేదలకు అందజేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అర్హులైన వారికి మాత్రమే ఇళ్లు మంజూరు చేయాలన్నారు. చిన్న పొరపాటు కూడా జరగడానికి వీల్లేదని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

**ఇదో మహోత్తర కార్యక్రమం..**

ఇదోక మహోత్తర కార్యక్రమం అని, ఇంత గొప్ప కార్యక్రమానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పేదలందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. రాష్ట్రంలో రైతన్నకు విత్తనాలు అందజేసే విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, నకిలీ విత్తనాల విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో రైతాంగానికి, ప్రజలకు హామీ ఇచ్చామని, గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణిని రద్దు చేస్తామని స్పష్టంగా చెప్పామన్నారు. చెప్పినట్టుగానే అధికారంలోకి రాగానే ధరణిని రద్దుచేసి ఆనాదిగా వస్తున్న దుర్మార్గపు చట్టాలను తొలగించి సరికొత్త భూ భారతి చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చామన్నారు. జూన్ 2న ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను నిర్వహిస్తామని చెప్పారు. పెద్ద ఎత్తున సంబరాలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు.

**ఇది ప్రజా ప్రభుత్వం.. మంత్రి పొంగులేటి**

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఇన్చార్జి మంత్రులతో కలిసి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని, జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమంపై అధికారులతో చర్చించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సీజనల్ వ్యాధుల దగ్గర నుంచి ఇందిరమ్మ ఇళ్ల వరకు ప్రతి ఒక్క అంశంపై చర్చ జరుపుతున్నామని, ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుంటున్నామని, అధికారులకు స్పష్టమైన ఆదేశాలిస్తున్నామన్నారు. రైతాంగానికి ప్రజలకు ఎక్కడ ఎటువంటి ఇబ్బంది కలగడానికి వీల్లేదని.. ఇది ప్రజా ప్రభుత్వమని, పేదల ప్రభుత్వమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు.

**మంత్రి తుమ్మల మాట్లాడుతూ..**

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఖమ్మం జిల్లా రాష్ట్రంలో ముందు ఉందని అన్నారు.

ఖమ్మం జిల్లాకు ముగ్గురు వర్చ్యువల్ మంత్రులున్నారని, జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించబోతున్నామని మంత్రి కోమటి రెడ్డి వెంట రెడ్డి తెలిపారు. ప్రభుత్వాసుపత్రులలో వైద్య సేవలు మెరుగుపరిచి పేదలకు మంచి వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని చెప్పారు. కార్పొరేటర్ స్థాయిలో పేదలకు వైద్యం అందించాలనే సంకల్పంతో పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీల సంఖ్య పెరిగిందని, మాత శిశు ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు.

## కవిత ఏం మాట్లాడిందో తెలీదు: సబితా



**హైదరాబాద్:** కవిత ఏం మాట్లాడిందో తనకు తెలీదని.. ఆమె వ్యాఖ్యలపై పార్టీ స్పందిస్తుందని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. గురువారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. విద్యను ఈ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. గత పదేళ్లలో విద్యకు కేసీఆర్ ఏం చేయలేదని సీఎం రేవంత్ రెడ్డి చెప్పడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను వ్యతిరేకించడం లేదు. విధాన పరమైన నిర్ణయాలను వ్యతిరేకిస్తున్నాం. విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. రూ.80 కోట్లని ఒకసారి.. మరోసారి 125 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం అన్నారు. ఇప్పుడేమో రూ. 200 కోట్లకు ఒక ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం అంటున్నారు. ఇలా ఎందుకు అంచనాలు పెంచుతున్నారు. ఒక్కో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కి ఎంత ఖర్చు పెడుతున్నారో చెప్పండి" అంటూ సబితా ప్రశ్నించారు. ఏడాది కాలంగా విద్యలో ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారు?. ఎన్ని నియోజక వర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రణాళిక ఏంటో ప్రభుత్వం స్పష్టం చేయాలి. పెండింగ్ 8 వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించండి. భవనాలు మాత్రమే కడితే సరిపోదు. సిలబస్‌లో ఏం మార్పు తెస్తున్నారు. ఆ స్కూళ్లలో ఎవరికి అడ్మిషన్స్ ఇస్తారు. సైనిక్, నవోదయ, మోడల్, మన ఊరూ-మన బడి, మండల స్థాయి స్కూళ్లను ఏం చేస్తారో ప్రభుత్వం చెప్పాలి.

..మా హయంలో ఉద్యోగాలే ఇవ్వలేదనీ రేవంత్ మాట్లాడుతున్నాడు. ఏడాదికి మీరు ఇస్తామన్న ఉద్యోగాలు ఇచ్చారా?. కుల వృత్తులకు అండగా ఉండాలనే ఉద్దేశంతోనే బర్లు, గొర్లు పంచారు. రెసిడెన్షియల్ స్కూల్లో పిల్లలతో వెట్టి చాకిరి చేయిస్తున్నారు." అంటూ సబితా మండిపడ్డారు.

# దైవసమానులు గుండి రాజర్షి

ఆయన కర్మయోగి. అష్టాదశ పురాణాలను ఔపోసన పట్టి, వేద వేదాంగ సకల శాస్త్రాలపై సాధికారికత కలిగి ఎలాంటి పౌరాణిక సందేహాన్ని అయినా నివృత్తి చేయగలిగిన అపర వేదవ్యాసుడు ఆయన. నిరంతర తపోనిష్ఠతో, నిత్యభాగవత పారాయణము మందే మునిగి తేలి, సిద్ధిపొందిన తాపసి ఆయన. దివంగత ప్రధాని పి.వి. నరసింహా రావు మొదలు గాగల అగ్ర నేతలు, కవిసామ్రాట్ విశ్వనాథ లాంటి సాంప్రదాయ కవులు, ప్రాచ్య పాశ్చాత్య విద్యావేత్తలు ఎందరి చేతనో పలుమార్లు దర్శింపబడి మహామహులచే పూజింప బడిన పరమ భాగవతోత్తముడు ఆయన. ఆయనే గుండి రాజర్షిగా పేరెన్నిక గన్న గుండి రాజన్న శాస్త్రి. ధర్మపురి క్షేత్ర గోదావరి తీరాన గుడి నిర్మించబడి, విగ్రహ ప్రతిష్ఠ జరిగి, నిత్య పూజలు అందుకుంటున్న దైవ సమానులు గుండి రాజర్షి. భారతీయ ప్రాచీన ఆర్ష విద్యలకు నెలవై, హైందవ సనాతన సాంప్రదాయాలకు పట్టు కొమ్మయై, వేద సంస్కృతి సభ్యతలకు ఆలవాలమై, వరదాయినిగా, భక్తి ముక్తి ప్రదాయినిగా తెలుగునేలపై వాసికెక్కిన, గోదావరి తీరస్త పవిత్ర తీర్థ రాజం ధర్మపురి క్షేత్ర కీర్తి ప్రతిష్టలను, దశదిశలా వ్యాపింప జేశారు, అపర వేదవ్యాసులుగా కీర్తించబడే గుండి రాజర్షి.. వ్యాస, వాల్మీక, కాళిదాస, కాణాద, పైల, జెమిని, పరాశర ఆపస్తంభ అది మునులు ఋషులు, యోగులు, కర్మిష్ఠులు, పరివ్రాజకుల, ఆధ్యాత్మికుల వార సత్వాన్ని కొనసాగిస్తూ, దేవతా పూజలతో, ఆధ్యాత్మిక ఆది భౌతిక కార్యక్రమాలను, అక్షయ నిధులైన పురాణ ప్రవచనాలను, క్షేత్ర రాజం పరిరక్షిస్తూనే ఉంది. ఆ సంప్రదాయ ఆచరణ క్రమంలో "అపర వేదవ్యాసులు" గా పేరెన్నికగన్న రాజన్న శాస్త్రి తన స్వగృహంలో ప్రవచనాలను నిర్వహించగా, దివంగత భారత ప్రధాని పీవీ నరసింహారావు, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, ఆచార్య దివాకర్ల వెంకటావధాని, తెన్నేటి విశ్వనాథం, విశ్వనాథ సత్యనారాయణ లాంటి మహామహులు ఎందరో, ప్రత్యేకించి ఈ క్షేత్రానికి వచ్చి, రాజన్న శాస్త్రి, భాగవత ప్రవచనాలను విని, ఆధ్యాత్మిక లోకాలలో విహరించి, ఆయనకు ప్రణమిల్లిన సంఘటనలు, క్షేత్ర వాసులకు చర్విత చర్వణలే. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణచే "మ్రోయు తుమ్మెద" లో వర్ణించ బడినట్లుగా, గుండి రాజన్న శాస్త్రి అష్టాదశ పురాణాలను, నిరంతరం అధ్యయనం చేస్తుండగా పాశ్చాత్య పండితులెందరో, పౌరాణిక సందేహ నివృత్తికై శాస్త్రి వద్దకు వెళ్లిన సంఘటనలు, క్షేత్రవాసులకు నిత్యజ్ఞాపకాలే. సాక్షాత్తు "వేదవ్యాస అవతారం"గా భావించబడే రాజన్న శాస్త్రి విగ్రహ ప్రతిష్ట చేసి, ఆలయం నిర్మించి, నిత్య పూజలు జరపడం విశేషం. ధర్మపురి క్షేత్రంలో గుండి లక్ష్మీ నరసింహ ఘనాపాఠి లక్ష్మీ నరసమ్మ దంపతులకు 1893 డిసెంబర్ 9న జన్మించిన శాస్త్రి, గుండి పాపయ్య కుటుంబానికి దత్తపుత్రులైనారు. బాల్యం నుండే ప్రహ్లాదాదుల వలె పరమాత్మ చింతనాపరులై, దివ్య ప్రబంధాదుల గానం చేస్తూ, ప్రాథమిక విద్య ఉర్దూ భాషలో జరిగినా, అష్ట వర్షములకే ఉపనయన సంస్కారులై, గాయత్రీ మంత్రోపాసకులై, వేదాధ్యయనాలు




తండ్రి వద్ద చేసి, లీలావతి గణిత సాధన, మంథని చెందిన గట్టు కృష్ణశాస్త్రి వద్ద అమర భాష శాస్త్రాలను నేర్చుకున్నారు. అనంతరం వేద వేదాంగ, శాస్త్ర ఆగమ, ప్రస్థాన త్రయ, సాయణ భాష్య, శాంతి పాఠాలను రామాయణ, భారత, భాగవతాది పురాణాలు, ప్రధానంగా భాగవత బ్రహ్మసూత్రాలను కంఠోపాఠంగా చెప్పగలిగిన, అసాధారణ ధారణ శక్తి సంపన్నులైనారు. స్థానిక లక్ష్మీనరసింహ ఆలయంలో, కొంతకాలం నిరంతర భాగవత సప్తాహ యజ్ఞాలను నిర్వహించారు. ఉషః కాల మందే లేచి, నిత్య గోదావరి స్నానం, సంధ్యావందనం, ధ్యాన, ధారణ, పూజ, ఉపాసన, పారాయణ ఆది సత్కార్యా చరణలు నిత్య కృత్యాలుగా కలిగి ఉండేవారు. సమకాలీన సలక్షణ వేద ఘనాపాటిల సన్నిధిలో, వేదార్థ, ఉపనిషత్, భాష్య ప్రవచనం గావించేవారు. భక్త బృందం సమేతంగా, రాత్రి సత్సంగ, భక్తి మయ జాగరణలు, సంగీత సభలు, సాహితీ గోష్టులు, భజనలతో గడిపేవారు. ప్రధానంగా ధర్మపురి దేవస్థానంలో, వైకుంఠ ఏకాదశి, నరసింహ నవరాత్రులు, శివరాత్రులు, ఉగాది, ఆదిగా పర్వదిన వేడుకలను ప్రారంభించి ఆచరింప చేశారు. పిత్ర స్వార్జితములను, దానధర్మాలకు సన్మానాలకు ధారపోసి, దాన గుణం సంపన్నులైనారు. బాలబాలికలచే, సంస్కృతం మాట్లాడింప చేస్తూ బాలురను శృతి, స్మృతి, పురాణ, కావ్య భక్తిరస ప్రధాన శ్లోకాలు, పద్యాలను కంఠస్తం చేయించేవారు. 1966 విజయదశమి నాడు క్షేత్ర రామలింగేశ్వరాలయంలో, సంస్కృతాంధ్ర డిగ్రీ ప్రాచ్య కళాశాల ప్రారంభించి, ప్రాణప్రతిష్ట గావించారు. నాటికీ, నేటికీ ఈ కళాశాల వేలాది మంది భాషా పండితుల తయారీ కేంద్రంగా భాసిల్లుతుండడానికి కారణ భూతు లైనారు. దేశ విదేశీయులు, శాస్త్రి దర్శనం చేసుకొని, పలు సందేహాలు నివృత్తి చేసుకునేవారు. శ్రీ శ్రీ శ్రీ శృంగేరి, కంచి కామకోటి, పుష్పగిరి, హంపి, పీఠాధిపతులు, శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ పెద్ద జీయర్ స్వామి, తదితర జగద్గురు వులు క్షేత్రానికి విచ్చేసిన అన్ని సందర్భాలలోనూ, వారి సన్నిధిన అష్టాదశ పురాణ సందర్భాలను ప్రవచించి, వారిచే సన్మానితులు అయినారు. పి.వి. నరసింహా రావు, బూర్గుల రామకృష్ణారావు, మర్రి చెన్నారెడ్డి, దామోదరం సంజీవయ్య తెన్నేటి విశ్వనాథం, విశ్వనాథ సత్యనారాయణ, దివాకర్ల వెంకటావధాని, బిరుదు రామరాజు, మార్కండేయ శాస్త్రి, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, మల్లాది చంద్రశేఖర శాస్త్రి తదితరులు, పలుమార్లు రాజర్షి వద్దకు ఏతెంచి పునీతుల మైనా మని భావించి, అపర వేదవ్యాసులుగా కీర్తించిన సందర్భాలు అనేకానేకాలు. 84 సంవత్సరాలు జీవించి, ధర్మపురి వాసులను సన్మార్గమున నడిపి, 1975 మే 30న జీవన్ముక్తులై శివైక్యం పొందారు. శాస్త్రి మనమడు గుండి విష్ణు ప్రసాద్ చొరవతో, ఆయన సతీమణి ప్రొఫెసర్ వారిజా రాణి సంపాదకత్వంలో, లబ్ద ప్రతిష్టులైన వారి ప్రత్యేక వ్యాసాలతో అపూర్వ, అపురూప, అమూల్య పుస్తకం అచ్చు వేసి, రాజర్షి గురించి పలు అంశాలు పొందు పరచ గలిగారు. "భగవత్ సాన్నిహిత్య సాధనకు సాధువులే కానక్కరలేదని, కౌటింబిక జీవన విధానంలోనూ, భగవానుని భక్తితో కొలిస్తే, ముక్తి లభించగలదని", కొత్త సంప్రదాయానికి పురుడు పోసి, నిత్య నిరంతర పురాణ ప్రవచనాలు నిత్యానందంగా భావించి, సిద్ధి పొందిన తాపసి రాజ రుషికి గోదావరి తీరాన, రామమందిర సమీపాన, స్థిర విగ్రహ ప్రతిష్ఠ గావించి, గుడి కట్టి నిత్య పూజలు నిర్వహించడం, ధర్మపురి వాసులు చేసుకున్న పురాకృత సుకృతం.

# తెలుగు సాహిత్యానికి తత్వశిఖరం

తెలుగు సాహిత్యాన్ని తన అద్భుత కవిత్వంతో, లోతైన విమర్శలతో, విశ్లేషణాత్మక వ్యాసాలతో కొత్త దిశల్లో నడిపించిన మహాకవి గుంటూరు శేషేంద్ర శర్మ. ఆయన కేవలం ఒక కవి మాత్రమే కాకుండా, సమాజంలో చైతన్యాన్ని రేపే ఒక విప్లవాత్మక శక్తి. ఆధునిక తెలుగు కవిత్వానికి ఊతమిచ్చిన మహోన్నత వ్యక్తిత్వం. శేషేంద్ర సాహిత్య ప్రపంచం వర్ణనాత్మకత, తత్త్వచింతన, సామాజిక చింతన, భాషా వైవిధ్యం, అంతర్జాతీయ దృక్పథం లతో విస్తరించి ఉంది. శేషేంద్ర శర్మ జననం 1927 అక్టోబర్ 20న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం నాగరాజుపాడు గ్రామంలో జరిగింది. ఆయన తండ్రి సంస్కృత సాహిత్యంలో ప్రావీణ్యం కలిగిన పూజారి గుంటూరు సుబ్రహ్మణ్య శర్మ. చిన్ననాటి నుంచే శేషేంద్రకు వేదాలు, ఉపనిషత్తులు, సంస్కృతం మీద మక్కువ పెరిగింది. విద్యాభ్యాసం తొటపల్లి గూడూరు పాఠశాలలో ప్రారంభమై ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రుడిగా, మద్రాసు లా కాలేజీ నుండి న్యాయ శాస్త్రంలో డిగ్రీతో కొనసాగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో మునిసిపల్ కమిషనర్‌గా ఉద్యోగం చేసినప్పటికీ, సాహిత్యపట్ల ఆయన ఆసక్తి ఎప్పటికీ తగ్గలేదు. శేషేంద్ర శర్మ సాహితీ ప్రస్థానం అసాధారణం. ఆయన కవిత్వంలో ఉన్న అద్భుత ఊహాశక్తి, సామాజిక చింతన, తత్త్వ విచారణ, వ్యక్తిత్వ విశ్లేషణ తెలుగు కవిత్వాన్ని కొత్త శిఖరాలకు చేర్చింది. కేవలం రూపకాలు, అలంకారాలతోనే కాదు, కవిత్వంలో లోతైన భావాలను మేళవించి సమాజాన్ని ఆలోచింపజేసే విధంగా రచనలు చేశారు. తన కవిత్వంలో తర్కం, ఆచారవిచారం, చరిత్ర బోధ, తత్త్వచింతన మేళవించి ఒక ప్రత్యేక శైలిని రూపొందించారు. "నా దేశం - నా ప్రజలు" అనే కావ్యం శేషేంద్రగారిని దేశవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి తెచ్చింది. ఇందులో సామాజిక అసమానతలు,



దేశభక్తి, మానవీయత వంటి అంశాలను రసప్రధంగా, ఆవేశ పూరితంగా వ్యక్తీకరించారు. "మంథర", "షోడశి - రామాయణ రహస్యాలు", "ఆధునిక మహాభారతం", "స్వర్ణహంస", "సముద్రపు రెక్కలు", "నెమలికన్ను" వంటి రచనలు శేషేంద్రను ఆధునిక తెలుగు సాహిత్యంలో దృఢంగా నిలిపాయి. "మంథర"లో భారతీయ తత్త్వశాస్త్రం పట్ల ఆయన అవగాహన, అంతరంగా పొందిన అనుభూతులు ప్రతిఫలిస్తాయి. "షోడశి"లో రామాయణంలోని రహస్యాలను లోతుగా పరిశీలిస్తూ శ్రీవరాలను సరికొత్త దృక్పథంలో ఆవిష్కరించారు. శేషేంద్ర వచన కవిత్వం కేవలం వర్ణనాత్మకతకు పరిమితం కాకుండా, జాతీయ మరియు అంతర్జాతీయ సాహిత్య ధోరణులను అద్భుతంగా మిళితం చేసింది. అందులో భాషా వైవిధ్యం, సంస్కృత పదసముపేతం, ప్రతీకలు, చిహ్నాల విశేష ప్రయోగం, శబ్ద సౌందర్యం సమ్మేళనం సాహితీ పాఠకులను విశేషంగా ఆకర్షిస్తుంది. కవిత్వం అంటే కేవలం భావాలను వ్యక్తీకరించడం మాత్రమే కాదు, అది ఒక చైతన్య ప్రవాహం అని ఆయన నిరూపించారు. శేషేంద్ర కవిత్వం మనసుకు హత్తుకునే రూపంలో, ఒక వేళ వినిపిస్తే సంగీతంలా, చదివితే తత్త్వ రససుధగా అనిపిస్తుంది. "సముద్రం నా పేరు", "గొరిల్లా", "మండే సూర్యుడు", "కవిసేన మేనిఫెస్టో", "రక్తరేఖ", "కాలరేఖ", "జనవంశమ్" వంటి రచనలు కాలంతో పోరాడే కవిత్వానికి, సమాజాన్ని చైతన్యపరిచే సాహిత్యానికి ప్రతీకలు. శేషేంద్రకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు (1994లో "నా దేశం - నా ప్రజలు"కు), తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్, కలకత్తా రాష్ట్రీయ హిందీ అకాడమీ అవార్డు, విశ్వకవి పురస్కారం లాంటి అనేక ప్రతిష్టాత్మక బహుమతులు లభించాయి. కవిసేనాని, కవి చక్రవర్తి, రాష్ట్రేంద్రులాంటి బిరుదులు ఆయన సాహిత్య ప్రస్థానానికి గౌరవ తీర్థాలు. శేషేంద్ర శర్మ కేవలం కవి కాదు - తత్త్వవేత్త, చింతకుడు, సమాజానికి మార్గదర్శకుడు. ఆయన రచనలు తెలుగులోనే కాదు, అనేక భాషల్లోకి అనువదించబడి విశ్వ సాహిత్యంలోనూ తనదైన స్థానం సంపాదించు కున్నాయి. 2007 మే 30న ఆయన భౌతికంగా మన మధ్యనుండి వెళ్లిపోయినా, ఆయన సాహిత్యమూర్తి తెలుగువారి హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతుంది. తెలుగు సాహిత్య చరిత్రలో శేషేంద్ర శర్మ ఒక మహానామం. ఆయన కవిత్వం, విమర్శ, తత్త్వచింతనలు ఈ తరానికి మాత్రమేకాదు, రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలవనున్నాయి.

# భారతీయ జర్నలిజం ఆద్యుడు

రెండు దశాబ్దాలకు పూర్వం ఆంగ్లం, పార్సియన్ లాంటి భాషల్లో మాత్రమే పాఠకులకు పత్రికలు అందుబాటులో ఉండేవి. హిందీ భాష అత్యధికంగా మాట్లాడే భారతంలో నాడు హిందీలో పత్రికలు ఉండేవి కాదు. ఈ లోటును గ్రహించిన కాన్పూర్‌కకు చెందిన పండిట్ జుగల్ కిషోర్ శుక్లా 30 మే 1826 రోజున కొల్‌కతాలో తొలిసారిగా "ఉదంత్ మార్తాండ్ (ఉద్యమించే సూర్యుడు)" అనే వార పత్రికను అందుబాటులోకి తేవడంతో భారతీయ భాషల్లో పత్రికల విప్లవం ప్రారంభమైంది. ఈ మహత్తర సంఘటనకు గుర్తుగా ప్రతి ఏట 30 మే రోజున "హిందీ జర్నలిజం దినోత్సవం (హిందీ జర్నలిజమ్ డే)"ను పాటించుట ఆనవాయితీగా మారింది. ఈ వేదిక ఆధారంగా హిందీ జర్నలిస్టులు, ఎడిటర్లు, ఫోటోగ్రాఫర్లు, కరస్పాండెంట్లు లాంటి వర్గాల త్యాగాలు, అంకితభావాలను గుర్తు చేసుకోవడంతో పాటు విధి నిర్వహణలో ప్రాణాలు సహితం కోల్పోయిన వారికి నివాళులు అర్పించడం జరుగుతుంది. నాడు హిందీ పాఠకులు తక్కువగా ఉండడంతో పాటు ఆర్థిక ఇబ్బందుల కారణంగా కేవలం 79 వారాలు మాత్రమే పత్రికలను విడుదల చేసి ఆ తర్వాత ఆపి వేయడం జరిగింది. అయినప్పటికీ నాడు జుగల్ కిషోర్ శుక్లా నాటిన చిన్న హిందీ పత్రిక బీజం కాలక్రమంలో విస్తరించి నేడు పాఠకులకు అనేక రకాలైన పత్రికలు, ఆన్‌లైన్ పత్రికలు, టివీ చానెల్స్ లాంటివి అందుబాటులోకి రావడం జరిగింది. పత్రిక అంటే సమాచార వితరణ మాత్రమే కాదని, ఇవి ప్రజలను ఏకం చేసే శక్తివంతమైన మాధ్యమాలని, సమస్యలను పరిష్కరించే వేదికలని తెలుసుకోవాలి. నేటి పత్రికలు మానవ హక్కులు, సజావుగా ఎన్నికల నిర్వహణ, విద్య, సమకాలీన అంశాలు, రాజకీయం, సామాజిక సమస్యలను బహిరంగ పరిచే వేదికలుగా అమూల్య సేవలను అందిస్తున్నాయి. 1826లో ప్రారంభమైన తొలి హిందీ పత్రిక తర్వాత దినదినం అభివృద్ధి చెందుతూ నేడు వందల, వేల పత్రికలు అందుబాటులోకి వచ్చాయి దైనిక్ జగరన్, అమర్ ఉజాల, హిందూస్థాన్, రాజస్థాన్ పత్రిక లాంటివి అనేకం పాఠకులకు సమాచార, విద్య, విజ్ఞాన, సామాజిక చైతన్య విందులను వడ్డిస్తున్నాయి. 1990ల్లో హిందీ టీవీ చానెల్స్ అందుబాటులోకి రావడం, తర్వాత యూట్యూబ్ చానెల్స్, మొబైల్ ఆప్‌లు లాంటి రావడంతో నేడు అరచేతిలో అన్ని పత్రికలు ఇమిడిపోయాయి. హిందీ జర్నలిజం దినం వేదికగా యూనివర్సిటీలు, పత్రికా సంస్థలు, ప్రెస్ క్లబ్‌లు, పాఠక సంఘాలు పలు చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలి. డిజిటల్ ఏఐ టెక్నాలజీ కొత్తపుంతలు తొక్కుతున్న వేళ నేడు పత్రికల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతూ పలు సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయి.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు

**గత ప్రభుత్వం ఇల్లు ఇచ్చిన పాపాన పోలేదు..**

**విడతలవారీగా అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు.**

**పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు.**





**అగ్నిధారన్యూస్ ఎలిగేడు** గురువారం ఎలిగేడు మండలం బురహాన్ మియా పేట, సుల్తాన్ పూర్, నర్సాపూర్ గ్రామాల్లో పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి ముగ్గుపోసి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణా రావు మాట్లాడుతూ...**

పెద్దపల్లి నియోజకవర్గంలోని 6 మండలాలలో నీ ఆరు గ్రామాలలో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని 3500 ఇందిరమ్మ గృహాలు మంజూరు అయ్యాయని ప్రస్తుతం 2000 పై చిలుకు ఇళ్లకు ఎలిగేడు,, జూలపల్లి, సుల్తానాబాద్, ఓదెల, కాల్వ శ్రీరాంపూర్, పెద్దపల్లి, మండలాలలో ఇళ్ల నిర్మాణానికి మంజూరి తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. నిరుపేదలకు పారదర్శకంగా ఇండ్లను అందించడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని పేర్కొన్నారు. 15 రోజులలో నియోజకవర్గంలో అన్ని గ్రామాలలో ఇందిరమ్మ గృహాలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. 5 లక్షల రూపాయలను విడతల వారీగా అందిస్తామని 400 ఎస్ఎఫ్టి తగ్గకుండా 600 ఎస్ఎఫ్టి పెరగకుండా గృహాలను నిర్మాణం చేసుకోవాలని తగ్గిన పెరిగిన బిల్లులు వచ్చే పరిస్థితిలు లేవని తెలిపారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో ఇల్లు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉన్న సమయంలో ప్రతి నిరుపేదకు ఇల్లు అందించారని ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం నిరుపేదలకు ఇల్లు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. రానున్న నాలుగు సంవత్సరాల కాలంలో నియోజకవర్గంలో 14 నుండి 15 వేల వరకు ఇళ్లను అందించడమే లక్ష్యమన్నారు.

## ఆన్ లైన్ బెట్టింగులకు బానిసై..

**మేడ్చల్ :** ఆన్లైన్ బెట్టింగ్ గేమ్ లకి బానిసై రాత్రి సమయాల్లో ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్థుడు మహబూబ్నగర్ కు చెందిన అల్లం శివ అనే వ్యక్తిని పహాడి షరీఫ్ పోలీసులు అరెస్టు చేసినట్లు రాచకొండ సిటీ సుధీర్ బాబు మీడియాకు తెలిపారు,నిందితుడు శివ పై ఈ ఐదు నెలల్లో పహాడి షరీఫ్, శంషాబాద్,హయత్ నగర్, ఎల్బీనగర్, పోలీస్ స్టేషన్ లలో ఏడు కేసులు నమోదు అయ్యాయన్నారు, నిందితుని వద్ద నుండి 20 లక్షల విలువైన బంగారు,వెండి ఆభరణాలు,రెండు బైక్ లు,నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్ కి తరలిస్తున్నట్లు తెలిపారు సిపి సుదీర్ బాబు...

## రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్రం కట్టుబడి ఉంది

**వరి సహా 14 ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధర పెంపు రైతులకు గుడ్ న్యూస్ లాంటిది**

**బిజెపి పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు**

**కరీంనగర్ :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతుల సంక్షేమం , అభివృద్ధి కోసం కట్టుబడి పని చేస్తుందని , ఆ దిశలోనే 2014 నుండి పంటల మద్దతు ధరను గణనీయంగా పెంచుకుంటూ వస్తుందని, ప్రస్తుత ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధర పెంచుతూ కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకోవడం , రైతుల పెట్టుబడిపై 50శాతం లాభం ఉండేలా ధరలు పెంచడం రైతులకు గుడ్ న్యూస్ లాంటిదని బిజెపి పార్లమెంటు కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు అన్నారు. ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధర పెంపు కోసం రూ.2.70 లక్షల కోట్లు కేటాయించిందని , క్వింటా వరి మద్దతు ధర రూ.69కి పెంచిరూ.2,369గా నిర్ణయించిందని తెలిపారు. 2025-26 ఖరీఫ్ సీజన్ కోసం 14 ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధరలను పెంచుతూ (ఎమ్ ఎస్ పి) కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకొని ఆమోదం తెలియజేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. వరి సాధారణ, గ్రేడ్ ఏకి క్వింటా రూ.69 పెంపుతో పాటు జొన్నలు క్వింటా రూ. 328 ,సజ్జలు క్వింటా రూ.150,రాగులు క్వింటా రూ.596 మొక్కజొన్న క్వింటా రూ.175 ,కందిపప్పు క్వింటా రూ.450 పెసర్లు క్వింటా రూ.86 ,మినుములు క్వింటా రూ.400 ,వేరుసెనగ క్వింటా రూ.480 పొద్దుతిరుగు క్వింటా రూ.441 ,సోయాబీన్ క్వింటా రూ.436 ,కుసుములు క్వింటా రూ.579 ,ఒలిసెలు క్వింటా రూ.820 ,పత్తి క్వింటా రూ.589 లతో మద్దతు ధర పెరుగుదల జరిగిందన్నారు. సగటు ఉత్పత్తి వ్యయంపై ఒకటిన్నర రెట్లు మద్దతు ధర పెంపు జరిగిందని పేర్కొన్నారు.

## కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న గుర్తింపు యూనియన్లు.

**కమాన్ పూర్ :** సింగరేణి సంస్థలో గెలిచిన యూనియన్లు హామీలు నెరవేర్చకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి ఆరోపించారు. ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి కక్ష సాధింపులకే పరిమితమైన యూని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. సింగరేణి సంస్థ ఆర్జి 3 ఒసిపి 2 గేట్ మిటింగ్ లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కార్మికులకు ఎన్నో రకాల హామీలను ఆశ చూపి ఎన్నికలలో గెలిచి సంవత్సరం కావస్తున్న ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేని, విమరార్శించారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం లో పలువురు చేరగా వారందరికీ యూనియన్ కండువాలు కప్పి సాధారంగా యూనియన్ లోకి ఆహ్వానించారు .ఈ సందర్భంగా రాజి రెడ్డి మాట్లాడుతూ ఇతర సంఘాలుకు సాధ్యం కాని ఎన్నో హక్కులను తాము సాదించామని తెలిపారు. మహిళలకు ఉద్యోగాలు, రూ.10లక్షల ఇంటి రుణం, తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం, 16 శాతం నుంచి 32 శాతంవరకు లాభాల వాటా ,క్వాటర్లకు ఏసీ సదుపాయం, 1% ఎలక్ట్రికల్ చార్జెస్ మినహాయింపు లాంటివి ఎన్నింటినో సాదించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో యూనియన్ ఆర్ జి త్రీ ఒ ఏపీఎ ఉపాధ్యక్షులు నాగేల్లి సాంభయ్య ,, దేవ శ్రీనివాస్, అన్ని విభాగాల కమిటీ సభ్యులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి సమాజానికి జర్నలిజం ఎంతో అవసరం ఉంది






**తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య**

**జర్నలిస్టుల సమస్యలపై ఫెడరేషన్ నిటారుగా నిలబడుతుంది -బండి విజయ్**

**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** టి డబ్ల్యూ జె ఎఫ్ వనపర్తి జిల్లా సన్నాహక సమావేశం గురువారం వనపర్తి పట్టణం తెలంగాణ గజిటెడ్ ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షులు బండి విజయ్ కుమార్లు హాజరైనారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు సోమయ్య మాట్లాడుతూ నేటి సమాజానికి జర్నలిజం అనేది అవసరమని, జర్నలిస్టు అనేవారు రాజకీయ నాయకులకు వత్తాసు పలకడం కాదు ప్రజల పక్షాన, జర్నలిస్టుల పక్షాన నిజమైన జర్నలిస్టులు నిలబడాలని వారు అన్నారు. ఉపాధ్యక్షులు బండి విజయ్ మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగంలో ఫోర్త్ ఎస్టేట్గా పిలువబడే జర్నలిజం, నేడు సంఘాల రూపంలో ఏర్పడి కొంతమంది వ్యక్తులు కొన్ని సంఘాలు అధికార పార్టీలకు అమ్ముడపోతున్నాయని, ఫెడరేషన్ అనేది నిటారుగా నిలబడి జర్నలిస్టుల పక్షాన కొట్లాడుతుందని, ఈ జర్నలిస్టు ఫెడరేషన్ అనేది కులాలకు మతాలకు అతీతంగా పని చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంబటి స్వామి, ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్, ఆర్థిక కార్యదర్శి రామకృష్ణారెడ్డి, గౌరవ అధ్యక్షులు దశరథం ఉపాధ్యక్షులు హుస్సేన్, కార్యదర్శి శేఖర్,తో పాటు వివిధ మండలాల బాధ్యులు జర్నలిస్టు ఫెడరేషన్ లో నూతనంగా సభ్యత్వం తీసుకున్న జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాలి

**కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి**




**అగ్నిధార న్యూస్, (రామగుండం):** నాణ్యమైన బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాలని కేంద్ర శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.గురువారం కోలిండియా,సింగరేణి పై కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కీలక సమీక్ష సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి,బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పెంచి వినియోగదారులను నిలుపుకోవాలని,నూతన గనులను సాధించుకోవడానికి కృషి చేయాలని సూచించారు.పని సంస్కృతిలో మార్పునకు కార్మిక సంఘాల సహకారం తీసుకోవాలన్నారు.రానున్న రోజుల్లో ఇంధన రంగంలో స్వయం సమృద్ధిని సాధించే విషయంలో ప్రభుత్వ బొగ్గు సంస్థలు డిమాండ్ కు తగినట్టుగా నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసేలా సమాయత్తపరిచేందుకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నడుం కట్టింది.ఇందులో భాగంగా కోలిండియా సహా సింగరేణిపై కీలక సమీక్ష సమావేశాన్ని నిర్వహించింది.ఇందులో బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గింపు నాణ్యత,సరఫరా తదితర అంశాల్లో ఎదురవుతున్న సవాళు వాటిపై తీసుకోవాల్సిన చర్యలపై కీలక దిశా నిర్దేశం చేసింది. కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అధ్యక్షతన ఢిల్లీ నుంచి జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్,ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సింగరేణి తరపున సంస్థ ఛైర్మన్ అండ్ ఎండీ ఎన్.బలరాం హైదరాబాద్ సింగరేణి భవన్ నుండి ఈ సమీక్షలో పాల్గొన్నారు.ఎన్.బలరాం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి సంస్థ ప్రగతి,భవిష్యత్తు ప్రణాళికలు తదితర అంశాలపై కూలంకశంగా వివరించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ కార్మికుల వేతనాలు,సంక్షేమ కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బొగ్గు ఉత్పత్తి ఖర్చు గణనీయంగా తగ్గించాలన్నారు. ఇందుకోసం కార్మిక సంఘాల సహకారాన్ని తీసుకోవాలని,పని సంస్కృతి మెరుగుపరచాలని సూచించారు. ఉత్పత్తి ఖర్చు తగ్గించడానికి సింగరేణి అధికారులు,బొగ్గు మంత్రిత్వ శాఖ నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు.ఈ కమిటీ ప్రత్యక్షంగా క్షేత్రస్థాయి పరిశీలిస్తుందని,కమిటీ చేసే ఆచరణాత్మక సూచనలను వెంటనే అమలు జరిపి ఉత్పత్తి ఖర్చును తగ్గించాలని సూచించారు. వినియోగదారులు సింగరేణి సంస్థకు దూరం కాకుండా ఉండాలంటే నాణ్యతపై కూడా దృష్టి పెట్టాలన్నారు.బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్ మాట్లాడుతూ బొగ్గు సంస్థల మనుగడకు కొత్త గనులను పెంచుకోవడం అత్యంత అవసరమని,ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం ద్వారా వినియోగదారులకు బొగ్గు ధర అందుబాటులోకి తీసుకురావొచ్చని,అంతిమంగా విద్యుత్ ఉత్పత్తి వ్యయం కూడా తగ్గి ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు.కోల్ ఇండియా గనులతో పాటు సింగరేణి గనుల పనితీరును,సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు.ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు(ఈ అండ్ ఎం),ఎల్వీ సూర్యనారాయణ రావు (ఆపరేషన్స్) కె.వేంకటేశ్వర్లు (పి అండ్ పి, పా),ఈడీ ఎస్డీఎం.సుభాని పాల్గొన్నారు.

# వనపర్తి పట్టణంలో పెబ్బేరు, పానుగల్ రహదారుల విస్తరణ పనులు ప్రారంభించండి

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** వనపర్తి పట్టణం నుండి పెబ్బేరు, పాన్ గల్ వెళ్ళే రహదారుల విస్తరణ పనులు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టర్ తన ఛాంబర్ లో రోడ్డు విస్తరణ పై సంబందించిన శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో రోడ్డు విస్తరణ పనులు చాలా జాప్యం జరుగుతుందని, ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా పనులు ప్రారంభించాలని రోడ్లు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు.రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న భవన నిర్మాణాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. రోడ్డు విస్తరణలో స్థలం కోల్పోయే వారికి టి.డి.ఎస్ (ట్రాన్స్ఫరబుల్ డెవలప్మెంట్ రైట్స్) బాండ్ లు తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో నాలుగింతలు లాభం ఉంటుందని అందువల్ల టి.డి.ఆర్ పై అవగాహన కల్పించాలని సూచించారు. టి.డి. ఆర్ అనేది భూమి కోల్పోయే యజమానులకు బాండ్ రూపంలో ఇప్పుడు మార్కెట్ విలువను బట్టి ఇస్తారని ఇది మార్కెట్ పెరిగే కొద్ది విలువ పెరుగుతూ నాలుగింతలు లాభం ఉంటుందని వివరించారు. రోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోతున్న యజమానులతో సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా మున్సిపల్ కమిషనర్ ను సూచించారు. రోడ్డు విస్తరణ పనులు మాత్రం తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు.అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జి యాదయ్య, రోడ్లు భవనాల కార్య నిర్వాహక ఇంజనీర్ దేశ్యా నాయక్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితులకు జీవితకాల జైలు శిక్ష

**-జిల్లాలో నేరాలకు పాల్పడిన వారికి శిక్షలు తప్పవు..**

**-ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దు**

**జిల్లా ఎస్పీ రావుల గిరిధర్**



**అగ్నిధారన్యూస్ గోపాలపేట వనపర్తి జిల్లా:** గోపాలపేట మండలం తాడిపర్తి గ్రామానికి చెందిన అకునమోని మల్లమ్మ తన అక్రమ సంబంధానికి భర్త బాలస్వామి అడ్డు వస్తున్నాడని అక్రమ సంబంధం పెట్టుకున్న చింతల వెంకటయ్య తో కలిసి భర్తను రోకలి బండతో కొట్టి హత్య చేసిన కేసులో నేరం రుజువవడంతో నేరస్తులైన ఆకునమోని మల్లమ్మ, చింతల వెంకటయ్యలకు జీవిత ఖైదుతో పాటు 14 వేల రూపాయలు జరిమానాను వనపర్తి జిల్లా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునిత తీర్పు ఇవ్వడం జరిగిందని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ తెలిపారు.పూర్తి వివరాల్లోకి వెళ్ళితే గోపాలపేట మండలం తాడిపర్తి గ్రామానికి చెందిన అకునమోని మల్లమ్మ తన అక్రమ సంబంధానికి భర్త బాలస్వామిని అడ్డు వస్తున్నాడని అక్రమ సంబంధం పెట్టుకున్న చింతల వెంకటయ్యతో కలిసి 2021 సంవత్సరంలో హత్య చేశారు.కొడుకు సాయి కుమార్ ఫిర్యాదు మేరకు అప్పటి గోపాలపేట ఎస్సై రామన్ గౌడ్ కేసు నమోదు చేయగా అప్పటి వనపర్తి సీఐ ప్రవీణ్ కుమార్ ఇన్వెస్టిగేషన్ ప్రారంభించారు. దీనిలో భాగంగా సాంకేతికంగా అవసరమైన ఆధారాలను సేకరించి నివేదికను తయారుచేసి నిందితులను రిమాండ్ కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. జిల్లా ఎస్పీ శ్రీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు ప్రస్తుత సీఐ కృష్ణయ్య ఎస్సై నరేష్,వనపర్తి కోర్టు లైజనింగ్ అధికారి హెడ్ కానిస్టేబుల్ కె, సత్యం, కోర్టు కానిస్టేబుల్ రమేష్ ఆధ్వర్యంలో కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్, గోపాల్ రెడ్డి వాదించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం నేరస్తులపై నేరం నిరూపణ అయినందున గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునిత తీర్పు వెలువరించడం జరిగింది.ఈ కేసులో నేరస్తులకు శిక్ష పడడంలో బాగా పనిచేసిన పోలీస్ అధికారులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ను, కోర్టు డ్యూటీ ఆఫీసర్లను ఎస్పీ అభినందించి త్వరలో రివార్డు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

## అనారోగ్య బాధితుడికి పరామర్శ

**బియ్యం, నిత్యావసర సరుకులను అందజేసిన సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షులు మడిపెల్లి మల్లేష్**



**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):** రామగుండం కార్పొరేషన్ పరిధిలోని రెండవ డివిజన్ అన్నపూర్ణ కాలనీకి చెందిన చెవుల రాజు గౌడ్ గత 15 రోజుల క్రితం హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స తీసుకొని రెండో రోజుల క్రితం హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయి అన్నపూర్ణ కాలనీలోని ఇంటికి వచ్చారని తెలుసుకున్న మడిపెల్లి మల్లేష్ గురువారం రోజున బాధిత కుటుంబాన్ని పరామర్శించి 25 కిలో బియ్యం తో పాటు నిత్యవసర సరుకులు అందజేశారు. అనంతరం మల్లేష్ మాట్లాడుతూ చెవుల రాజు గౌడ్ గత కొద్ది రోజుల క్రితం తలలో బ్లడ్ క్లాట్ కావడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబీకులు హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్ లో అడ్మిట్ చేసి అనంతరం రాజ్ ఠాకూర్ కు ఫోన్ చేసి పేషెంట్ పరిస్థితి తెలుపగా వెంటనే ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సంబంధించిన డాక్టర్ తో మాట్లాడి బాధితునికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఫోన్ ద్వారా తెలుపడం జరిగిందని మల్లేష్ చేశారు హైదరాబాద్ నుండి ఎమ్మెల్యే తనతో ఫోన్ లో మాట్లాడి,రాజు గౌడ్ పేషంట్ కు సహాయం అందించి ఆ కుటుంబానికి అండగా ఉండాలని సూచించారని వారి ఆదేశాల మేరకు నేడు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆరోగ్య విషయాలు తెలుసుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమానికి సహకారం అందించిన ఫౌండేషన్ సభ్యులందరికీ బాధిత కుటుంబ సభ్యుల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా నాయకులు గుర్రల మల్లేష్ యాదవ్, జూల వినయ్, తదితరు పాల్గొన్నారు

## జూలపల్లిలో డీ. ఎల్. పీ. వో ఆకస్మిక తనిఖీ..!




**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్** కమాన్ పూర్ మండలంలోని జూలపల్లి గ్రామంలో గురువారం మంథని డివిజనల్ పంచాయతీ అధికారి కొమ్మర సతీష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ రికార్డులను, పారిశుద్ధ్య పనులను పరిశీలించి, గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా ఎటువంటి నిర్మాణ పనులు చేయరాదు అని హెచ్చరించడం జరిగింది. వర్షాకాల దృష్ట్యా సీషనల్ వ్యాధుల ప్రబలకుండా పారిశుద్ధ్య పనులను నిరంతరం సక్రమంగా చేయవలెనని, గ్రామ పంచాయతీ మల్టిపర్పస్ సిబ్బందికి ఆదేశించనైనది. గ్రామంలో నిరంతరం గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా ఇంటింటా చెత్త సేకరణ జరిపి సెగ్రిగేషన్ షెడ్ లో తడి చెత్తను పొడి చెత్తను వేరు చేసి నాణ్యమైన సేంద్రియ ఎరువు తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శికి మల్టిపర్పస్ సిబ్బందికి తగు సూచనలు జారీ చేసినారు. వైకుంతధామం నర్సరీని సందర్శించి వాటరింగ్ సక్రమంగా చేయుట, నీటి ఎద్దడి లేకుండా చూడవలసిందిగా ఆదేశించారు. జూలపల్లి పంచాయతీ సమీపంలోని మంచి నీటి వాటర్ ట్యాంకును పరిశీలించి, ట్యాంకును ఎప్పటికప్పుడూ శుభ్రపరచి క్లోరినేషన్ చేయవలసినదిగా ఆదేశించినారు.లో బాగంగా జూలపల్లి గ్రామంలో ప్రతి రోజు 20 మందికి తగ్గకుండా గ్రామ వాసులు అకడమిక్ ట్రేనింగ్ ద్వారా సర్టిఫికెట్ పోందవలెనని పంచయాతీ కార్యదర్శి కి ఆదేశించనైనది. తదుపరి సింగరేణి సంస్థ నుండి జూలపల్లి గ్రామ పంచాయతీకి రావలసిన ఇంటి పన్నులను సత్వరమే సింగరేణి అధికారులను పంచాయతీ కార్యదర్శి సంప్రదించి త్వరగా వసూలు చేయవలసినగా ఆదేశించనైనది. వారి వెంట పంచాయతీ కార్యదర్శి అంబటి శంకర్, గ్రామ పంచాయతీ మల్టిపర్పస్ సిబ్బంది పాల్గొన్నారు.

# శాంతి భద్రత విషయంలో అప్రమత్తంగా వుండాలి





**కేసులలో పరిశోధన పారదర్శకంగా ఉండాలి**

**రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):** శాంతి భద్రతల విషయంలో పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా నిరంతరం అప్రమత్తంగా వుండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, పోలీస్ అధికారులకు సూచించారు.నెలవారి సమీక్షాలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పోలీస్ అధికారులతో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం రోజున కమిషనరేట్ కార్యాలయములో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. డిసిపి లు, అడిషనల్ డీసీపీ అడ్మిన్, ఎసిపిలు, ఇన్స్పెక్టర్లు, ఎస్.ఐలు పాల్గోన్న ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్, డివిజన్, జోన్లవారిగా పెండింగ్ కేసులకు సంబంధించి నేరస్థుల అరెస్టు, దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జ్షీట్‌కు సంబంధించి ప్రస్తుత కేసుల స్థితిగతులపై పోలీస్ కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రామగుండము పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోద్కెన గ్రేవ్ కేసులు, మహిళలపై నేరాలు, ఆస్తి నేరాలు, పోక్సో కేసులు, మిస్సింగ్, గంజాయి, రోడ్డు ప్రమాదాల కేసులకు సంబంధించి సమాచారంతో పాటు, కేసుల పరిష్కారం కోసం ఏ విధమైన చర్యలు తీసుకోవడం జరిగిందని మొదల్కెన అంశాలపై పోలీస్ కమిషనర్ పోలీస్ స్టేషన్ వారిగా పోలీస్ అధికారులతో సమీక్షా జరిపారు. అదేవిదంగా నేరాల నియంత్రణ కోసం అధికారులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై పోలీస్ కమిషనర్ అధికారులతో చర్చించడంతో పాటు, అధికారులతో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ .... సూదీర్ఘకాలంగా పెండింగ్ లో వున్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రధానంగా మహిళలపై జరిగిన నేరాలకు సంబంధించి కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయడంతో పాటు, నిందితులకు కోర్టులో శిక్షలు పడేవిధంగా తగు సాక్ష్యాధారాలను కోర్టుకు అందజేయాల్సిందిగా అలాగే మహిళలు, బాలికల మిస్సింగ్ కేసుల్లో అధికారులు వేగం స్పందించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారి పట్ల కఠినంగా వ్యవహిరంచాలని తెలిపారు. దొంగతనాలు జరగకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా వుంటూ, విజబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని ప్రధానం చోరీలకు పాల్పడిన నేరస్థులను గుర్తించడంతో పాటు చోరీ సోత్తును స్వాధీనం చేసుకోవడంలో అధికారులు సమయస్ఫూర్తి వ్యవహరిస్తూ దర్యాప్తు కోనసాగించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి సంబంధిత డిపార్ట్మెంట్ అధికారులతో కలసి తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. బక్రీద్ సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ లలో అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా పీస్ కమిటీ మీటింగ్ నిర్వహించాలని సూచించారు. తరుచుగా నేరాలకు పాల్పడే నేరస్థులపై సస్పెక్ట్, రౌడీ షీట్ల తెరవాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించి ముందస్తు సమాచారాన్ని సేకరించాల్సి వుంటుందని పోలీస్ అధికారులు ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారితో స్నేహపూర్వకంగా వుండాలని భాధ్యయుతంగా విధులు నిర్వహిస్తూ బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో పెద్దపల్లి డిసిపి కరుణాకర్, అడిషనల్ డిసిపి అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి మల్లారెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఏం. రమేష్, మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, పెద్దపల్లి ఏసిపి జి కృష్ణ, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్, ఏ ఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ శ్రీనివాస్, సీఐ లు, వివిధ వింగ్స్ ఇన్స్పెక్టర్ లు, ఎస్ఐ లు పాల్గొన్నారు.

## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు మెడికల్ కిట్ల పంపిణీ

ట్రస్టు ఛైర్మెన్ ఉప్పల వెంకటేష్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** చారగొండ మండలంలోని జూపల్లి జెపల్లి గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తెలంగాణ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ సహకారంతో గ్రామంలోని గర్భిణీ స్త్రీలకు మెడికల్ కిట్లని పంపిణీ చేయడం జరిగింది.ఈ పంపిణీ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు తిరుపతయ్య.శ్రీరాములు. బిక్షపతి. సైదులు గౌడ్. సైదులు నాయక్.బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు. ప్రశాంత్.మల్లేష్ బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు. ఉప్పల వెంకటేష్ యువసేన మున్నా నాయక్ ఆశ వర్కర్లు, గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు భూమి పూజ



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి సహకారంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కోసం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల తో కలిసి స్పెషల్ ఆఫీసర్ తాహసిల్దార్ నాగార్జున లబ్ధిదారులకు ఇల్లు మంజూరు పత్రం అందజేసి ఇంటి నిర్మాణం ముగ్గు పోసి భూమి పూజ చేసి నిర్మాణ పనులు ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి పార్టీ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి కృష్ణ, గ్రామ మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి తిక్కల వెంకటయ్య, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు పెంటయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్ రెడ్డి, కాకి శివ, నాయకులు చిన్నా, హరి, మోహన్ రెడ్డి, నరసింహులు గౌడ్ మీసాల రాములు, కాకి లక్ష్మయ్య, వెంకట్ రెడ్డి, శ్రవణ్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, జంగయ్య, విలేకర్ మహేష్ శంకరయ్య, జంగయ్య, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యత ప్రమాణాలు పెంచి, వినియోగదారులను నిలుపుకోవాలి

**అగ్ని ధారా న్యూస్, మందమర్రి మండలం మే 29** నూతన గనులను సాధించుకోవడానికి కృషి చేయాలి. పని సంస్కృతిలో మార్పునకు కార్మిక సంఘాల సహకారం తీసుకోవాలి. కోలిండియా,సింగరేణి పై కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కీలక సమీక్ష పాల్గొన్న కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి,బొగ్గు శాఖ కార్యదర్శి,విక్రమ్ దేవ్ దత్ సింగరేణి భవన్,మే 29, 2025 రానున్న రోజుల్లో.. ఇంధన రంగంలో స్వయం సమృద్ధిని సాధించే విషయంలో ప్రభుత్వ బొగ్గు సంస్థలు డిమాండ్కు తగినట్టుగా నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసేలా, సమాయత్తపరిచేందుకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నడుం కట్టింది.ఇందులో భాగంగా కోలిండియా సహా సింగరేణిపై కీలక సమీక్ష సమావేశాన్ని నిర్వహించింది. ఇందులో బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గింపు, నాణ్యత,సరఫరా తదితర అంశాల్లో ఎదురవుతున్న సవాళ్లు,వాటిపై తీసుకోవాల్సిన చర్యలపై కీలక దిశా నిర్దేశం చేసింది. కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అధ్యక్షతన ఢిల్లీ నుంచి జరిగిన ఈ..వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్,ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సింగరేణి తరఫున సంస్థ ఛైర్మన్ మరియు ఎం.డీ ఎన్.బలరామ్ హైదరాబాద్ సింగరేణి భవన్ నుండి ఈ సమీక్షలో పాల్గొన్నారు. శ్రీ ఎన్.బలరామ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి సంస్థ ప్రగతి,భవిష్యత్తు ప్రణాళికలు తదితర అంశాలపై కూలంకశంగా వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ... కార్మికుల జీతాలు, సంక్షేమ కార్యక్రమాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బొగ్గు ఉత్పత్తి ఖర్చు గణనీయంగా తగ్గించాలన్నారు. ఇందుకోసం కార్మిక సంఘాల సహకారాన్ని తీసుకోవాలని,పని సంస్కృతి మెరుగుపరచాలని సూచించారు.అలాగే ఉత్పత్తి ఖర్చు తగ్గింపునకు సింగరేణి అధికారులు మరియు బొగ్గు మంత్రిత్వ శాఖ నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు.ఈ కమిటీ ప్రత్యక్షంగా క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతుందని, కమిటీ చేసే ఆచరణాత్మక సూచనలను వెంటనే అమలు జరిపి ఉత్పత్తి ఖర్చును తగ్గించాలని సూచించారు. వినియోగదారులు సింగరేణి సంస్థకు దూరం కాకుండా ఉండాలంటే నాణ్యతపై కూడా గట్టి దృష్టి పెట్టాలన్నారు. బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్ మాట్లాడుతూ...బొగ్గు సంస్థల మనుగడకు కొత్త గనులను పెంచుకోవడం అత్యంత అవసరమని, అలాగే ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం ద్వారా.. వినియోగదారులకు బొగ్గు ధర అందుబాటులోకి తీసుకురావొచ్చని,దీంతో అంతిమంగా విద్యుత్ ఉత్పత్తి వ్యయం కూడా తగ్గి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆయన కోల్ ఇండియా గనులతో పాటు సింగరేణి గనుల పనితీరును,సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు.సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు(ఈ అండ్ ఎం),ఎల్వీ సూర్యనారాయణ రావు (ఆపరేషన్స్), కె.వేంకటేశ్వర్లు (పి అండ్ పి, పా),ఈడీ ఎస్డీఎం.సుభాని తదితరులు పాల్గొన్నారు.




## సురవరం తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక: రెడ్డి సేవాసమితి



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** భాష సాహిత్యం సాంస్కృతిక పునరుజీవనం, ప్రాంత అభి వృద్ధి కోసం సురవరం చేసిన కృషి ఎనలేనిదని రెడ్డి సేవాసమితి జిల్లా అధ్యక్షుడు నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం సురవరం ప్రతాపరెడ్డి జయంతి పురస్కరించుకొని వనపర్తిలోని రెడ్డి సేవా సమితి భవనంలో చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ సాంఘిక చైతన్యానికి నిలువెత్తు స్ఫూర్తి సురవరం అన్నారు. కార్యక్రమంలో మేఘారెడ్డి, బౌద్ధారెడ్డి, సుధాకర్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణంతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి నియోజకవర్గంలోని తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణానికి ఇటీవల శంకుస్థాపన చేయడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యా అందించడం జరుగుతుందని దాదాపు 25 ఎకరాల స్థలంలో 200 కోట్ల రూపాయలతో భవన నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అన్ని సామాజిక వర్గాలకు ముఖ్యంగా బడుగు బలహీనవర్గాల వారికి అభివృద్ధి కోసం పాఠశాలలో ఒకేసారి 2560 ఉంది విద్యార్థులు ఉండే విధంగా చేపడం జరుగుతుందని ఇక్కడ 4వ తరగతి నుండి 12వ తరగతి వరకు చదువుకునే అవకాశం ఉంది అని డోకూరి ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

## పాఠశాలలు ప్రారంభమయ్యే సమయానికి పారిశుద్ధ్య కార్మికులను నియమించాలి

ప్రధానో పాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి వెంకటరమణ



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**వేసవి సెలవులు ముగిసే నాటికి పాఠశాలలు ప్రారంభమయ్యే లోపల ప్రతి పాఠశాలకు పారిశుద్ధ కార్మికులను నియమించాలని నాగర్ కర్నూల్ జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ వి సి హెచ్ వెంకటరమణ కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలను పటిష్ట పరచాలని ఉద్దేశంతో గత సంవత్సరం ప్రతి పాఠశాలకు ఉచిత విద్యుత్తు పారిశుద్ధ కార్మికులను నియమించడం జరిగింది. గతంలో ప్రతి పాఠశాలలో పారిశుద్ధ కార్మికుల లేక పాఠశాలలో అపరిశుద్ధ పరిస్థితుల్లో ఉండేవి. ఆ సమస్యను ప్రభుత్వం చిత్తశుద్ధి తో గ్రహించి గత సంవత్సరం ప్రతి పాఠశాలకు పారిశుద్ధ కార్మికులను నియమించి పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచడానికి ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడాని తోడ్పడింది. అదేవిధంగా ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ప్రతి పాఠశాలకు పారిశుద్ధ కార్మికులను నియమించాలి. ఉన్నత పాఠశాల స్థాయిలో ఆన్లైన్ వర్కులు ఎక్కువగా ఉండటం వల్ల ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి ప్రతి పాఠశాలకు కంప్యూటర్ సిస్టం ను ఏర్పాటుచేసి పార్ట్ టైం కంప్యూటర్ ఆపరేటర్ను నియమించాలి. ఒక 20 సంవత్సరాలుగా ప్రధానోపాధ్యాయులు ప్రమోషన్ లేక అదే పోస్టులో రిటైర్డ్ కావడం జరుగుతుంది. సర్వీస్ రూల్స్ ను క్రమబద్ధీకరించి డి ఈ ఓ పోస్టులను , ఎం ఈ ఓ పోస్టును అప్గ్రేడ్ చేసి ప్రధానోపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వడం వల్ల చాలామంది కి మేలు జరుగుతుంది.ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నటువంటి ఉద్యోగులకు కనీస రుసుముతో నగదు రహిత ఆరోగ్య కార్డులను ప్రభుత్వం అందించేలా చర్యలు తీసుకోవాలి. పెండింగ్ లో ఉన్న డీఏలు పిఆర్సీలను ప్రకటించి ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతిగా నిరూపించుకోవాలని శ్రీ వి సి హెచ్ వెంకటరమణ కోరారు .

# డాన్స్ వల్ల ఎన్నో ప్రయోజనాలు మానసిక ఒత్తిడి తగ్గిస్తుంది






**జె ఎస్ డాన్స్ అకాడమీ నిర్వాహకులు**

**ప్రపంచ డాన్స్ అవార్డ్స్ గ్రహీత శేఖర్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వేసవి కాలం కావడంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగానే అనుభవం గల డాన్స్ మాస్టర్ ప్రపంచ డాన్స్ అవార్డు గ్రహీత. శేఖర్ జేయస్ డాన్స్ స్టూడియో స్థాపించారు ఇందులో భాగంగానే వేసవికాలంలో తల్లిదండ్రులు లేని పిల్లలకు వికలాంగులకు అనాథ పిల్లలకు ఆర్మీ జవాన్ల పిల్లలకు ఉచితంగా డాన్స్ శిక్షణ ఇస్తున్నారు. అలాగే కమర్షియల్ గా కూడా డాన్స్ క్లాసులు నిర్వహిస్తున్నారు. కూచిపూడి భరతనాట్యం జానపదం పల్లె పదం కోలాటం భక్తి దేశభక్తి ఆదివాసి ట్రెడిషనల్ బతుకమ్మ. రాష్ట్రవ్యాప్తంగా దేశవ్యాప్తంగా ఉన్న సాంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులకు చక్కగా వివరిస్తూ చక్కటి నృత్యం నేర్పిస్తున్నారు. ఇందులో భాగంగానే కల్వకుర్తి పట్టణంలోని సిల్వర్ జూబ్లీ క్లబ్ యూనియన్ బ్యాంక్ ఎదురుగా జేఏఎస్ డాన్స్ అకాడమీ స్టూడియోను స్థాపించారు విశేష స్పందన లభించింది ఏర్పాటు చేసినటువంటి డాన్స్ అకాడమీకి భారీ స్పందన లభించింది. దాదాపు ఒక నెలలోనే పలు అంశాలపై డాన్స్ చేస్తున్నారు విద్యార్థులు ఇందులో నేర్చుకున్న విద్యార్థులచే చక్కటి కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ఉంటుందని ఉత్తమ కనపర్చిన విద్యార్థుల చేత ఇంటర్నేషనల్ రికార్డ్స్ కూడా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని ప్రపంచ అవార్డు గ్రహీత శేఖర్ పేర్కొన్నారు. డాన్స్ వల్ల ఎంతో లాభం ఉందని చిన్నారులకు మంచి ఎక్సర్సైజ్ మానసిక ఒత్తిడి తగ్గిస్తుంది. అలాగే శరీరానికి ఒక ఔషధం లాగా ఒక మందులాగా పని చేస్తుంది. ఈ డాన్స్ చిన్నా పెద్ద తేడా లేకుండా ఎవరైనా సరే డాన్స్ నేర్చుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి .మెదడుకు మేధాశక్తి శరీరానికి కావలసిన మంచి ఎక్సర్సైజ్ మరియు వారికి తెలియకుండానే వత్తిడినీ తగ్గుతుంది. దీనివల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి అందుకోసమే డాన్స్ పై ప్రపంచ దేశాలలో మంచి స్పందన ఉంది. అందుకోసమే డాన్స్ నేర్చుకోవాలి. పుట్టిన పిల్లాడు ఎలాగైతే శరీర అవయవాలు కదిలిస్తాడో .డాన్స్ వల్ల కూడా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. తల వెంట్రుకల నుండి అరికాలి వేళ్ళ వరకు మంచి ఎక్సర్సైజ్ ఉంటుంది. అందుకోసమే వారికి తెలియకుండానే శరీరంలో ఏమన్నా ఆవక తవ్వకాలు అంగవైకల్యం అలాంటిది ఉంటే వెంటనే డాన్స్ చేస్తున్న సమయంలో వారికి తెలియకుండా రిమూవ్ అవుతుంది. ఎన్నో ప్రయోజనాలు డాన్స్ వల్ల ఉంటున్నాయి. అందుకోసమే డాన్స్ క్లాసులకు విశేష స్పందన ఉంటుందని వేసవిలోనే కాకుండా 365 రోజులు జేయస్ డాన్స్ స్టూడియో చిన్నారులకు మరియు పెద్దలకు అందరికీ అందుబాటులో ఉంటుందని ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని జే యస్ డాన్స్ అకాడమీ నిర్వాహకులు ప్రపంచ డాన్స్ అవార్డు గ్రహీత శేఖర్ పేర్కొన్నారు.

# పుస్తక పఠనంతో అపార జ్ఞానం






**స్వాతంత్రోద్య మంలో గ్రంథాలయోద్యమం కీలక భూమిక పోషించింది**

**గ్రంథాలయాలు పోటీ పరీక్షార్థులకు ఊతం ఇస్తాయి**

**విజ్ఞాన భాండాగారం.. మన సమత గ్రంథాలయం**

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):** స్వాతంత్రోద్య మంలో గ్రంథాలయోద్యమం కీలక భూమిక పోషించింది. విజ్ఞాన బాండాగారాలుగా నేటికీ గ్రంథాలయాలు ప్రజల మన్ననలు పొందుతున్నా యి. అయితే పౌర గ్రంథాలయాలను సమస్యలు వెంటాడుతున్నాయి. వైజ్ఞానిక, సాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్న తరుణంలో గ్రంథాలయాలను పాఠకులు ఆదరించడం లేదు. విజ్ఞానాన్ని పంచే గ్రంథాలయాల పట్ల పాలకుల్లో, పాఠకుల్లో ఆదరణ కొరవడింది. ప్రజాస్వామ్య వ్యవస్థతో పాటు సార్వజనీక విద్యకు మూల స్తంభంగా పేర్కొనే గ్రంథాలయ వ్యవస్థ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. రాష్ట్రంలో గ్రంథాలయ వ్యవస్థకు పూర్వవైభవం లభిస్తుందని మేధావులు, విద్యావేత్తలు ఆశాభావం వ్యక్తం చేసి నా ఆ దిశగా చర్యలు కొరవడ్డాయి. జాతీయ గ్రంథాలయోద్యమం దేశానికి స్వాతంత్ర్య సాధనలో తన భూమిక పోషించింది. స్వాతంత్రోద్యమం, సహకారోద్యమం, స్వదేశీ ఉద్యమం, వయోజన విద్య తదితర ప్రచారోద్యమాలకు గ్రంథాల యోద్యమం పునాదులు వేసింది. గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, ఆళ్వారుస్వామి, సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంత రావు, అయ్యంకి వెంకటరమణయ్య, అడుసుమిల్లి శ్రీనివాసరావు వంటి మహానుభావులు గ్రంథాలయాల ఆవశ్యకతపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి ప్రజలను చైతన్యపరిచారు.

**గ్రంథాలయాలు పోటీ పరీక్షార్థులకు ఊతం ఇస్తాయి**

విజ్ఞానం, వికాసాలను పెంచడంలో గ్రంథాలయాలు కీలక భూమిక పోషిస్తాయి. చదువుకున్న ప్రతీ వ్యక్తి రోజూ కొంత సమయం పుస్తక పఠనం చేస్తే ప్రయోజనం తప్పక కలుగుతుంది. ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్చుకొని జీవన విధానాన్ని మెరుగు పర్చుకోవడానికి ఇది దోహదపడుతుంది. విద్య, ఉద్యోగ పోటీ పరీక్షల్లోనూ విద్యార్థులు, ఉద్యోగార్థులు సత్తా చాటేందుకు గ్రంథాలయాలు ఉపయోగపడుతున్నాయి. పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు గ్రంథాలయాల్లో లభిస్తాయి. చారిత్రక అంశాలు, వర్తమానాంశాలు, ఇతర అన్ని రంగాల సమగ్ర సమాచారం కావాలంటే గ్రంథాలయాల పుస్తకాల్లో లభ్యమవుతుంది.

**విజ్ఞాన భాండాగారం.. మన సమత గ్రంథాలయం**

పెద్దపల్లి జిల్లాలోని రామగుండం మూడో డివిజన్ అన్నపూర్ణ కాలనీ లోని మన ఈ సమతా గ్రంథాలయంలో వార్తా పత్రికలతోపాటు, వివిధ రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు, చిన్నారులు, వృద్ధులు, మహిళలకు ఉపయోగపడే పుస్తకాలను అందుబాటులో ఉంచాము. అలాగే పరిశోధనలకు సమాచారం లభించే రెఫరెన్స్ గ్రంథాలు కూడా గ్రంథాలయాల్లో ఉంటాయి. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ భాషల దినపత్రికలు, వివిధ వార, పక్ష, మాస పత్రికలు పాఠకులకు అందుబాటులో ఉండేలా చర్యలు చూస్తున్నాం. ప్రధానంగా చారిత్రక, భౌగోళిక, రాజకీయ, సామాజిక, విజ్ఞాన, వైద్య, ఆరోగ్య, సాంస్కృతిక, సాహిత్య కళారంగాల వివరాలతో కూడిన పుస్తకాలు సమత గ్రంథాలయంలో ఉన్నాయి. తెలంగాణ, భారతదేశ, ప్రపంచ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమం, ప్రపంచ యుద్ధాలు, సామాజిక, రాజకీయ ఉద్యమాలు, భారత రాజ్యాంగం, ఆర్థిక వ్యవస్థ, దేశ నేతలు, శాస్త్రవేత్తల జీవిత చరిత్రలు, శాస్త్రీయ ఆవిష్కరణలు, క్రీడలు, ప్రాచీన, ఆధునిక సాహిత్యం, రచయితలు, కవులు, కళాకారులు, సాహిత్యకారులు, వైద్యం, ఆరోగ్యం, ఇంగ్లీష్, హిందీ, తెలుగు భాషా నిఘంటువులు, మనోవైజ్ఞానిక, వ్యక్తిత్వ వికాసం పెంపొందించే పుస్తకాలు, అధ్యాత్మిక పుస్తకాలు.. ఇలా అన్ని రకా ల పుస్తకాలు మన దగ్గర లభిస్తాయి. ప్రసిద్ధ క్షేత్రాలు, పర్యాటక స్థలాలు, చట్టాలపై అవగాహన కల్పించే పుస్తకాలూ ఉన్నాయి. రోజూ పుస్తక పఠనంతో విద్యార్థుల్లో విజ్ఞాన, ప్రతిభా పాటవాలు పెరుగుతా యి. పద సంపద, విషయ పరిజ్ఞానం, భాషపై పట్టు ఒనగూరుతాయి. వర్తమాన రాజకీయాంశాలు, జాతీయ, అంతర్జాతీయ అంశాలను తెలుసుకునేందుకు దినపత్రికలు, పోటీ పరీక్షల మ్యాగజైన్లు, జర్నల్లు లైబరీలో ఉన్నాయి. ఇంగ్లీష్ దినపత్రికల అధ్యయనం వల్ల భాషా పరిజ్ఞానం పెరుగుతుంది. విలువైన పుస్తకాలు కొనుగోలు చేసే ఆర్థికస్థితి లేని విద్యార్థులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయి కనుక విద్యార్థిని విద్యార్థులు యువకులు మన ఈ సమత గ్రంథాలయాన్ని సద్వినియోగపరుచుకొని జ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిందిగా తెలియజేస్తున్నాము.

దుర్గం ప్రమీల నగేష్, సమతా ఫౌండేషన్, సమతా గ్రంథాలయ నిర్వాహకురాలు,

సెల్: 9494333899

## మృతునీ కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆర్థిక సహాయం

**ట్రస్టు ఛైర్మెన్ ఉప్పల వెంకటేష్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మండలం తుర్కలపల్లీ గ్రామానికి చెందిన కొంగళ్ళ మల్లయ్య అనే రైతు కూలీ అనారోగ్యంతో మరణించడం జరిగింది.ఈ విషయాన్ని తుర్కలపల్లి బిఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తెలంగాణ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ మృతినీ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో, బిఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి శేఖర్ గౌడ్, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు దారమోని గణేష్, బిఆర్ఎస్వి ఉపాధ్యక్షుడు నాగరాజు, ఉప సర్పంచ్ బీరయ్య మల్లయ్య,పరుషరాములుసైదులు వెంకటయ్య, రాముల,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## రైతుల పక్ష పాతి కాంగ్రెస్ ప్రభుత్వం

**రైతులకు ట్రాన్స్ఫార్మర్ పంపిణీ**

**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్వకుర్తి, వెల్దండ, చారకొండ మండలాల పరిధిలోని దాదాపు 100 మంది రైతులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి క్యాంపు కార్యాలయంలో ట్రాన్స్ఫార్మర్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని,రైతుల బాగు కోసం, బడుగు బలహీన వర్గాల కోసం పనిచేస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో, పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్, పీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనంద్ కుమార్, మాజీ జెడ్పిటిసి అశోక్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు గుమ్మ కొండా రాములు, వెల్దండ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి, సంజీవ్ యాదవ్, సురేందర్ రెడ్డి,ఆమనగల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, కిసాన్ సెల్ నాయకులు పర్వత్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ నాయకులు ,మరియు యువజన కాంగ్రెస్ ఎన్ ఎస్ యు ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన విద్యార్థుల వేసవి సమ్మర్ క్యాంపు వేడుకలు

**క్యాంపులో నూతన పాఠ్యాంశాలతో పాటు**

**ఆట పాటలు నేర్చుకున్న విద్యార్థులు**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్ క్యాంపు వేసవి సెలవుల్లో విద్యార్థులకు మే నెల ఒక నెలపాటు నిర్వహించటం జరిగినదని బాలోత్సవ కమిటీ కన్వీనర్ చెన్నయ్య కో కన్వీనర్ వెంకటయ్య తెలిపారు.ఈరోజు ముగింపు సభ నిర్వహించడం జరిగినది ముగింపు సభకు ముఖ్యఅతిథిగా ఎంఈఓ శంకర్ నాయక్ హాజరై సమ్మర్ క్యాంపు నిర్వహణ అభినందించారు వేసవి సెలవుల్లో విద్యార్థులు బయట టైం వృధా చేయకుండా గణితం, ఇంగ్లీష్ తెలుగు ప్రాథమిక అంశాలు ఆటలు, పాటలు నేర్చుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు చాలా ఉపయోగపడతాయని అన్నారు. సమ్మర్ క్యాంపులో పాఠాలు బోధించిన కే. పద్మా, వై. పద్మ పవన్ కృష్ణ గౌడ్ వెంకటేశ్వర్లు, పాండయ్య సారులను శాలువాల తో సన్మానించారు.ఈ కార్యక్రమంలో, యుటిఎఫ్ మాజీ సీనియర్ నాయకులు ఏపీ. మల్లయ్య ఎంప్లాయిస్ పత్రిక ఎడిటర్ కే వెంకటేశ్వర్లు కే వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగించారు. ముగింపు సమావేశంలో పాల్గొన్నవారు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పులిజాల పరుశురాములు ,యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు చిన్నయ్య, మండల కార్యదర్శి నెహ్రూ ప్రసాద్, జే వి వి నాయకులు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు మెడికల్ కిట్ల పంపిణీ

**ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మండలం ,మార్చాల గ్రామంలో గర్భిణీ స్త్రీలకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, తలకొండపల్లి మాజీ జడ్పీటిసి ఉప్పల వెంకటేష్ సహకారంతో గ్రామ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మార్చాల గ్రామంలోని గర్భిణీ స్త్రీలకు మెడికల్ కిట్ల పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో, గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు పి ఎ సి ఎస్ డైరెక్టర్ దేశం పుల్లారెడ్డి,మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు తలసాని కృష్ణారెడ్డి, విజయ డైరీ అధ్యక్షులు కాంకల శ్రీశైలం , మాజీ ఎంపిటిసి సభ్యులు కడల సంతోస మల్లేశ్ ,మాజీ ఉప సర్పంచ్ మదన్మోహన్ రావు ,మాజీ వార్డు సభ్యులు డొక్కా లింగం, కల్వకుర్తి మండల టిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు వట్టేపు కిషోర్ బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, తాండ్ర తిరుపతయ్య, మార్చాల ఆంజనేయులు,యువ నాయకులు వట్టేపు గణేష్, పెరుమల్ల కృష్ణ గర్భిణీ స్త్రీలు మరియు ఆశ వర్కరు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## నేడు కడ్తల్ మండల కేంద్రంలో జరిగే కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం విజయవంతం చేయాలి

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కడ్తాల మండల కేంద్రంలో నేడు ఉదయం 11 గంటలకు ఎంబిఎ గార్డెన్స్ లో నిర్వహించే కల్వకుర్తి నియోజకవర్గం రంగారెడ్డి జిల్లా ముఖ్య నాయకుల ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశనికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్ల నరసింహారెడ్డి, ఇన్చార్జి శివసేన రెడ్డి, ధారా సింగ్ పాల్గొనీ మండల, బ్లాక్ నూతన కార్యవర్గ నియామకాల స్వీకరణ నియమించడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. కావున ఈ సమావేశానికి మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సింగల్ విండో చైర్మన్, సింగల్ విండో డైరెక్టర్లు, యువజన కాంగ్రెస్ నాయకులు ఎన్ ఎస్ యు ఐ కార్యకర్తలు అన్ని విభాగాల అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు, ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొనీ విజయవంతం చేయాలని తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి అన్నారు.



# నార్త్ అబ్బాయి, సౌత్ అమ్మాయి ప్రేమ..

## ఇంట్రెస్టింగ్‌గా జాన్వీ కపూర్ 'పరమ్ సుందరి' టీజర్

బాలీవుడ్ నటులు జాన్వీ కపూర్, సిద్ధార్థ్ మల్హోత్రా కలిసి నటించిన రొమాంటిక్ కామెడీ చిత్రం 'పరమ్ సుందరి' ఫస్ట్ లుక్ టీజర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. దినేష్ విజన్ నిర్మిస్తున్న ఈ రొమాంటిక్ కామెడీ చిత్రాన్ని తుషార్ జలోటా ('దాస్వీ' ఫేమ్) దర్శకత్వం వహించారు. ఈ చిత్రం నార్త్ ఇండియాకు చెందిన 'పరం' (సిద్ధార్థ్ మల్హోత్రా), సౌత్ ఇండియాకు చెందిన 'సుందరి' (జాన్వీ కపూర్) మధ్య ప్రేమకథగా సాగనుంది. వీరిద్దరి మధ్య సాంస్కృతిక భేదాలు, హాస్యభరితమైన సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ చిత్రంలో రాజీవ్ ఖండేల్వాల్, ఆకాష్ దహియా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'పరమ్ సుందరి' చిత్రం జూలై 25, 2025న థియేటర్లలో విడుదల కానుంది. ఈ టీజర్‌లో కేరళలోని అందమైన బ్యాక్‌వాటర్స్, హౌస్‌బోట్‌ల నేపథ్యం అద్భుతంగా ఉంది. సిద్ధార్థ్, జాన్వీ ఒక బైక్‌పై రొమాన్స్ చేస్తూ కనిపించారు. బ్యాక్‌గ్రౌండ్‌లో సోను నిగమ్ ఆలపించిన మధురమైన పాట హైలైట్‌గా నిలిచింది.



# 20 నిమిషాల పాత్రకి 20కోట్లట..

## పదేళ్ల క్రితం హీరో పాత్రకి అదే పారితోషికం

సినిమా రంగం ఎవరిని ఎప్పుడు నెత్తికి ఎక్కించుకుంటుందో ఎవరిని నేలకేసి కొడుతుందో అంచనా వేయడం అంత సులభం కాదు. అందుకు నిదర్శనంగా మన తెలుగు హీరోను చెప్పొచ్చు. వయసులో ఉన్నప్పుడు  ఉరకలేసే ఉత్సాహంతో ఫైట్లూ, డ్యాన్సులూ వేసినా సమకాలికులైన హీరోలపై సాధించలేకపోయిన పైచేయిని..సక్సెస్‌నూ వృద్ధాప్యంలో సాధిస్తూ ఆశ్చర్యపరుస్తున్నాడు బాలకృష్ణ. ఇటవలి కాలంలో సీనియర్ నటుల్లో బాలకృష్ణ అందుకుంటున్న విజయాలు మరెవ్వరికీ సాధ్యం కావడం లేదనేది వాస్తవం. నిజానికి యుక్తవయసులో ఉండగా కూడా బాలయ్య ఇంత సందడి చేయలేదని చెప్పొచ్చు. వయసులో ఉండగా చేయలేకపోయిన యాడ్స్‌లో కూడా ఆయన ఇప్పుడు సత్తా చాటుతుండడం దీనికో నిదర్శనం.   ఈ నేపథ్యంలో తాజాగా సినీరంగంలో హల్‌చల్ చేస్తున్న ఒక వార్త మరోసారి బాలకృష్ణ సరికొత్త స్టామినాను చాటి  చెబుతోంది. అదేమిటంటే జైలర్ 2 సినిమాలో అతిథి పాత్రలో బాలకృష్ణ కనిపించబోతున్నాడని, అందుకు గాను అత్యధిక పారితోషికం అందుకుంటున్నారని.. కేవలం 20 నిమిషాల నిడివి ఉండే పాత్ర కోసం బాలకృష్ణ ఏకంగా రూ.20కోట్లకు పైనే రెమ్యునరేషన్ ఇవ్వడానికి జైలర్2 నిర్మాతలు ఓకే అన్నారని తెలుస్తోంది. ఈ సమాచారం ఒక్కసారిగా టాక్ ఆఫ్ ద ఇండస్ట్రీగా మారింది. ఒకప్పుడు అంటే దాదాపుగా ఒక పదేళ్ల క్రితం  డిక్టేటర్ వంటి సినిమాల్లో నటించే సమయంలో బాలకృష్ణ మొత్తం సినిమాకి తీసుకున్న రెమ్యునరేషన్ కూడా దాదాపుగా అంతే ఉంటుందని సినిమా వర్గాలు చెబుతున్నాయి. ఒక సినిమా మొత్తం కనిపించే  హీరోగా పదేళ్ల క్రితం తీసుకున్న పారితోషికాన్ని ఇప్పుడు కేవలం 20 నిమిషాల పాత్ర కోసం తీసుకుంటూ బాలకృష్ణ కొత్త రికార్డ్ సాధించారని చెప్పొచ్చు.  మొదటి నుంచీ నిర్మాతలకు అందుబాటులో ఉండే హీరోగా బాలకృష్ణకు పేరుంది. జయాపజయాలతో సంబంధం లేకుండా  పారితోషికం  రూపంలో నిర్మాతల నెత్తిన భారం మోపే వాడు కాదని అందుకే ఎన్ని ఫ్లాపులొచ్చినా బాలకృష్ణ చేతిలో సినిమాలు లేని పరిస్థితి ఎప్పుడూ లేదని అంటుంటారు. అంతెందుకు ఆయన రెమ్యునరేషన్ అమాంతం పెరిగిన ఈ పదేళ్లలో చూసుకున్నా... బాలకృష్ణ కెరీర్‌లో విజయాలకన్నా అపజయాలే ఎక్కువ.



# నెక్ట్స్ లెవల్‌లో అజిత్‌కుమార్ ఏకే 64

కోలీవుడ్ స్టార్ యాక్టర్ అజిత్‌కుమార్ కు సంబంధించి ఎప్పుడూ ఏదో ఒక అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతూ ఉంటుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ స్టార్ యాక్టర్ నటిస్తున్న కొత్త ప్రాజెక్టు ఏకే 64 తాజాగా ఈ మూవీపై ఓ ఆసక్తికర వార్త తెరపైకి వచ్చి అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తోంది. ఈ చిత్రాన్ని టాలీవుడ్ టాప్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుందని తెలిసిందే. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహించబోతున్న ఈ మూవీకి మ్యూజిక్ సెన్సేషన్ జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. తాజా వార్తల ప్రకారం ఏకే 64 ఈ ఏడాది అక్టోబర్‌లో సెట్స్‌పైకి వెళ్లనుంది. 2026 వేసవిలో విడుదల కానుంది. కాగా ఈ సినిమాను అధిక్ రవిచంద్రన్ మరో లెవల్‌కు తీసుకెళ్లేలా తెరకెక్కించబోతున్నాడట. ఈ చిత్రంలో పాపులర్ అందాల భామలు పూజా హెగ్డే, నయనతారను ఫీ మేల్ లీడ్ రోల్ కోసం తీసుకునే విషయాన్ని మేకర్స్ పరిశీలిస్తున్నట్టు ఇండస్ట్రీ సర్కిల్ క్రేజీ టాక్. ఇదే నిజమైతే సిల్వర్ స్క్రీన్‌పై ఈ సారి అజిత్‌కుమార్ ఎలా కనిపించబోతున్నాడని సస్పెన్స్ నెలకొంది. గుడ్ బ్యాడ్ అగ్లీ, విదాముయార్చి సినిమాల తర్వాత అజిత్‌కుమార్ నుంచి  రాబోతున్న ప్రాజెక్ట్ కావడంతో ఏకే 64పై అంచనాలు భారీగానే ఉన్నాయి.

# విడుదల తేదీ ప్రకటించిన రవితేజ 'మాస్ జాతర'

మాస్ మహారాజా రవితేజ ఇటీవల కాలంలో సరైన విజయం కోసం ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. 'ధమాకా' తర్వాత ఆయనకు పెద్ద హిట్ దక్కలేదు. గతేడాది విడుదలైన ఈగల్, మిస్టర్ బచ్చన్ చిత్రాలు ఆశించిన విజయాన్ని సాధించలేకపోయాయి. ఈ నేపథ్యంలో, రవితేజ ఎలాగైనా హిట్ కొట్టాలనే కసితో ఉన్నారు. ఈ క్రమంలోనే ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మాస్ జాతర'. ఈ సినిమాకు భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. రవితేజ సరసన శ్రీలీల కథానాయికగా నటిస్తోంది. వీరిద్దరూ గతంలో 'ధమాకా'తో ప్రేక్షకులను విశేషంగా అలరించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'మనదే ఇదంతా' అనే ట్యాగ్ లైన్‌తో వస్తున్న ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ తాజాగా ప్రకటించారు. ఈ సినిమాను వినాయక చవితి కానుకగా.. ఆగష్టు 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమాలో రవితేజ క్లాసిక్ పాటలలో ఒకటైన ఇడియట్ సినిమాలోని చూపులతో గుచ్చి గుచ్చి చంపకే పాటను ఇందులో రీమిక్స్ చేస్తున్నట్లు సమాచారం. ఇక టైటిల్‌కు తగినట్లుగానే మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉండబోతుందని చిత్రబృందం వెల్లడించింది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతాన్నందిస్తున్నారు.



# తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు

తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన గద్దర్ ఫిల్మ్ అవార్డులపై అల్లు అర్జున్ స్పందించారు. పుష్ప 2 చిత్రానికి ఉత్తమ నటుడిగా తనను ఎంపిక చేయడం గౌరవంగా ఉందన్నారు. ఈ గౌరవాన్ని కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. దర్శకుడు సుకుమార్, నిర్మాతలతో పాటు పుష్ప టీమ్ మొత్తానికి ఈ ఘనత దక్కుతుందని చెప్పారు. ఈ అవార్డును తన అభిమానులకు అంకితం చేస్తున్నట్లు అల్లు అర్జున్ ప్రకటించారు.  అలాగే జూనియర్ ఎన్టీఆర్ కూడా గద్దర్ అవార్డులపై స్పందించారు.  సినిమా వాళ్లకు తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది నుంచి అవార్డులు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. దేవర చిత్రానికి గాను ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా అవార్డు గెలుచుకున్న  గణేష్‌తో పాటు విజేతలందరికి శుభాకాంక్షలు తెలియజేశారు.  కాగా, 2024 సంవత్సరానికి గాను తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను గురువారం ప్రకటించింది. మొత్తం 11 కేటగిరీల్లో వీటిని వెల్లడించారు. 2024కు సంబంధించి అన్ని కేటగిరీల్లోనూ అవార్డుల వివరాలను గురువారం జ్యూరీ చైర్‌పర్సన్ జయసుధ వెల్లడించారు. బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో మూడు చిత్రాలకు అవార్డులు ప్రకటించారు. అందులో మొదటి చిత్రం కల్కి , రెండో చిత్రంగా పొట్టేల్, మూడో చిత్రంగా లక్కీ భాస్కర్ ఎంపికైంది. ఇక ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్(పుష్ప 2), ఉత్తమ నటిగా నివేధా థామస్ ( 35 చిన్న కథ కాదు) అవార్డుకు ఎంపికయ్యారు. జూన్ 14న ఈ అవార్డులను అందిస్తారు.



Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed  at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli  Pin co.505172  State Telangana
RNI TITLE CODE:TELTEL/2024/89359 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com